వివేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :184 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 19 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



ఏపీలో నేటి నుంచి
స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు

- నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక
- రేపు 28 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక
- ఎన్నికైన రోజు నుంచే ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం
- ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపీటీసీలు, జడ్పీటీసీల ద్వారా పరోక్ష ఎన్నికలు
- కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక నిబంధనలు
- ఎన్నికల నిర్వహణకు అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మండల, జిల్లా పరిషత్‌లకు నూతన పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఎంపీపీలు, వైస్ ఎంపీపీలను ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోనుండగా, శుక్రవారం 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్లను జడ్పీటీసీలు ఎన్నుకోనున్నారు. పరోక్ష పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలతో ఎన్నికైన పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం వివరాలు 2లో..

గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట

- భవిష్యత్ అవసరాలకు పక్కా ప్రణాళిక!
- రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3
- ఆరు నెలల్లో 14,852 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ అంచనా
- 103 ప్రాజెక్టులకు ఆమోదం.. రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు

అమరావతి

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని సూచించారు. ఉండవల్లిలోని క్యాంపు



కార్యాలయంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో విద్యుత్ డిమాండ్, కొత్త ప్రాజెక్టుల పురోగతి, పెట్టుబడుల ఒప్పందాలపై చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు విద్యుత్ వినియోగం వివరాలు 2లో..



సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు..
న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

- న్యాయవ్యవస్థపై ఆరోపణల నేపథ్యంలో చర్యలు
- వివరణ ఇవ్వాలని ఆదేశం.. 2027 జనవరి 20కు తదుపరి విచారణ




భారత్ వ్యతిరేక ప్రచారానికి
రాహుల్‌గాంధీ నాయకత్వం

- కొలంబియా యూనివర్సిటీలో దేశ ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- విదేశాలకు వెళ్లినప్పుడల్లా తప్పుడు వ్యాఖ్యలు

ఉత్తరాంధ్రకు రెడ్ అలర్ట్

- నరసాపురం--పూరీ మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 110 కి.మీ. వేగంతో ఈదురుగాలులు..
- అప్రమత్తమైన యంత్రాంగం
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



విశాఖపట్నం

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వైపు కదులుతోంది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నవంబర్ 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నానికి నరసాపురం--పూరీ మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం అక్వాన్ తుపాను గత ఆరు గంటల్లో గంటకు 9 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదిలింది. నవంబర్ 18 సాయంత్రం 5.30 గంటల సమయానికి నరసాపురానికి 500 కిలోమీటర్లు, కళింగపట్నానికి 540 కిలోమీటర్లు, చెన్నైకి 560 కిలోమీటర్లు, పూరీకి 690 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను మరింత వివరాలు 2లో..

ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

- 23 నుంచి 112కు పెరగనున్న ప్యాకేజీలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని చికిత్సలు
- 89 కొత్త వైద్య సేవలకు ప్రతిపాదన
- చిన్నచిన్న వ్యాధులకు స్థానికంగానే వైద్యం
- హిస్టరెక్టమీ నుంచి గ్లకోమా వరకు చికిత్సలు
- ఆస్పత్రుల అభివృద్ధికి అదనపు నిధులు





మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది
లతీఫ్ భట్ హతం

- మసీదులో దాక్కున్నా వదలని భద్రతా బలగాలు..
- లొంగిపోవాలని కోరినా నిరాకరణ
- రూ.15 లక్షల రివార్డు ప్రకటించిన ఉగ్రవాది కథకు తెర..
- ఆపరేషన్‌ను అభినందించిన అమిత్ షా

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ

చిప్ తయారీలో గ్లోబల్ కేంద్రంగా తీర్చిదిద్దుతాం!

మంత్రి నారా లోకేశ్ ప్రకటన


సిలికాన్ ఫ్యాబ్‌లకు 80 శాతం పెట్టుబడి రాయితీ

తిరుపతిలో 5 వేల ఎకరాల్లో ప్రత్యేక పార్క్

అమరావతి

దేశంలోనే సెమీకండక్టర్ తయారీకి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. చిప్‌ల తయారీ నుంచి ప్యాకేజింగ్ వరకు అన్ని విభాగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వెల్లడించారు. సిలికాన్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 80 శాతం వరకు పెట్టుబడి రాయితీ కల్పిస్తాయని తెలిపారు. సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించేలా ఏపీ ప్రభుత్వం సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0ను ప్రకటించినట్లు లోకేశ్ వివరించారు. వివరాలు 2లో..

మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!



- ధరల పెరుగుదలపై కేంద్రంపై ఖర్గే ఫైర్
- కనీస అవసరాలకూ కష్టమే
- నిత్యావసరాల ధరలకు రెక్కలు
- దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు
- ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- భారీగా పెరిగిన టోకు ద్రవ్యోల్బణం
- ఇంధనం, ఆహార ధరల ప్రభావం

భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

- ప్రపంచ పరిణామాలతో మారుతున్న అంతర్జాతీయ వ్యవస్థ
- కొవిడ్, యుద్ధాలతో సరఫరా వ్యవస్థలకు సవాళ్లు
- తక్కువ ఖర్చు కంటే విశ్వసనీయతకే పెద్దపీట
- జపాన్ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ గమ్యం
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాల్లో భాగస్వామ్యం



గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట..

-మొదటిపేజీ తరువాయి


18.23 శాతం పెరిగినట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం సహా వాతావరణ పరిస్థితులు విద్యుత్ డిమాండ్‌పై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 14,852 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు.

రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు రూ.21,838 కోట్ల వ్యయంతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రణాళికలను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఈ కారిడార్ ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి పెరిగే కొద్దీ వాటిని గ్రిడ్‌కు అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

36,050 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు

రాష్ట్రవ్యాప్తంగా 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో హెచ్చుతగ్గులు



ఉన్నప్పుడు విద్యుత్ సరఫరాను సమతుల్యం చేసేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని వివరించారు. ప్రాజెక్టుల అనుమతులు, నిర్మాణ ప్రక్రియలను వేగవంతం చేసి నిర్దిష్ట కాలపరిమితిలో పనులు పూర్తయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు.

9 లక్షల సోలార్ కనెక్షన్ల లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయాలని సమీక్షలో నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి తొమ్మిది లక్షల సోలార్ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించి, ప్రజలకు విద్యుత్ ఖర్చు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఇంధన రంగంలో రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో ఇంధన రంగానికి పెట్టుబడులు పెరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 103 విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటి ద్వారా రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో విద్యుత్ రంగానికి సంబంధించి మరో రూ.2.56 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరినట్లు తెలిపారు.

ఒప్పందాలు కార్యరూపం దాల్చాలి

పెట్టుబడుల ఒప్పందాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా వాస్తవ ప్రాజెక్టులుగా మారాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అనుమతులు, భూసేకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారాలు చూపాలని సూచించారు. సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ..

-మొదటిపేజీ తరువాయి

ఈ విధానం కింద సిలికాన్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్రం, రాష్ట్రం కలిపి 80 శాతం వరకు పెట్టుబడి రాయితీ అందిస్తాయని పేర్కొన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది అత్యధిక ప్రోత్సాహకమని ఆయన తెలిపారు. డిస్‌ప్లే, కాంపౌండ్ సెమీకండక్టర్ ఫ్యాబ్‌లకు 70 శాతం వరకు ప్రోత్సాహకాలు కల్పిస్తామని వెల్లడించారు.

తిరుపతిలో 5 వేల ఎకరాల్లో పార్క్

సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఒకే ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో 5 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక సెమీకండక్టర్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రవాణా సదుపాయాలతో పాటు వేగవంతమైన అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఇండియా సెమీకండక్టర్ మిషన్-2కు అనుగుణంగా



కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రెండో దశ ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు అనుగుణంగా రాష్ట్ర సెమీకండక్టర్ విధానాన్ని సవరించినట్లు లోకేశ్ చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంతో పాటు దేశీయంగా చిప్ తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు.

యువతకు ప్రత్యేక శిక్షణ.. నెలకు రూ.10 వేలు

సెమీకండక్టర్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. యువతకు ఈ రంగంలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు మంత్రి తెలిపారు. శిక్షణ పొందే ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

దేశీయ చిప్ తయారీకి ఏపీ వేదిక

భారత్ తన అవసరాలకు సంబంధించిన చిప్‌లను దేశంలోనే తయారు చేసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. చిప్ తయారీ, ప్యాకేజింగ్, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి వంటి విభాగాలను ఒకే పారిశ్రామిక వ్యవస్థగా అనుసంధానించి రాష్ట్రాన్ని అంతర్జాతీయ సెమీకండక్టర్ రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఇన్సూరెన్స్ లేని వాహనాలకు టోల్ వద్దే చెక్!

అమరావతి : వాహనాలకు తప్పనిసరిగా ఉండాల్సిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించేందుకు చర్యలు చేపడుతోంది. బీమా గడువు ముగిసిన లేదా ఇన్సూరెన్స్ లేని వాహనాలను జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్దే గుర్తించే విధానాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ విధానంలో వాహనం టోల్ ప్లాజా దాటగానే దాని బీమా వివరాలను వాహన్ డేటాబేస్‌తో పరిశీలించి, పాలసీ గడువు ముగిసినట్లయితే యజమానికి ఎస్ఎంఎస్ పంపిస్తారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తమ ఇన్సూరెన్స్ గడువును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు.

టోల్ దాటగానే బీమా వివరాల తనిఖీ

ప్రస్తుతం వాహనానికి ఇన్సూరెన్స్ ఉందా లేదా అనే విషయం సాధారణంగా తనిఖీల సమయంలోనే బయటపడుతోంది. కొత్త విధానం అమల్లోకి వస్తే టోల్ ప్లాజా దాటిన వెంటనే వాహనం రిజిస్ట్రేషన్ వివరాలను వాహన్ డేటాబేస్‌లో పరిశీలిస్తారు. ఆ వాహనానికి చెల్లుబాటయ్యే థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉందా లేదా అనేది ఆటోమేటిక్‌గా తనిఖీ చేస్తారు. పాలసీ గడువు ముగిసినట్లు గుర్తిస్తే వాహన యజమాని రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపిస్తారు.

దిల్లీలో ప్రయోగాత్మకంగా అమలు

దిల్లీలోని ముండ్కా టోల్ ప్లాజా వద్ద ఎన్‌హెచ్ఏఐ ఈ



విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. వాహనాల వివరాలను నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) నిర్వహించే వాహన్ డేటాబేస్‌తో అనుసంధానించి బీమా స్థితిని పరిశీలిస్తున్నారు. ఇన్సూరెన్స్ గడువు ముగిసిన వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్, టోల్ దాటిన సమయం, బీమా గడువు ముగిసిన తేదీ వంటి వివరాలతో సందేశం పంపిస్తారు. ప్రస్తుతం ఇది ప్రయోగాత్మక దశలోనే ఉంది. దేశవ్యాప్తంగా ఎప్పటి నుంచి అమలు చేస్తారనే తేదీని ఎన్‌హెచ్ఏఐ ఇంకా ప్రకటించలేదు.

థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి

మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 146 ప్రకారం రోడ్లపై తిరిగే వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి. ప్రమాదాల్లో ఇతరులకు గాయాలు, ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగితే బాధితులకు పరిహారం అందించడంలో ఈ బీమా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ప్రతి వాహన యజమాని తన పాలసీ గడువును పరిశీలించుకోవాలని, గడువు ముగియకముందే రెన్యువల్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జరిమానాలు భారీగా పెంపు

ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 196 ప్రకారం జరిమానా విధిస్తారు. 2026 ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చిన సవరణ ప్రకారం మొదటిసారి ఉల్లంఘనకు వాహనం బేస్ ప్రీమియానికి మూడు రెట్లు లేదా రూ.5,000ల్లో ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని జరిమానాగా చెల్లించాలి. రెండోసారి లేదా ఆ తర్వాత ఉల్లం ఘనకు బేస్ ప్రీమియానికి ఐదు రెట్లు లేదా రూ.10,000ల్లో ఏది ఎక్కువైతే ఆ మొత్తం జరిమానాగా విధిస్తారు.

గడువు ముగియకముందే రెన్యువల్ చేసుకోండి

వాహనదారులు ఇన్సూరెన్స్ గడువు ముగిసిన తర్వాత నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే రెన్యువల్ చేసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. బీమా లేకుండా వాహనాలు నడిపి జరిమానాలు, చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవద్దని కోరారు. సురక్షిత ప్రయాణంతో పాటు రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భరోసా కల్పించడంలో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కీలకమని పేర్కొన్నారు. రవాణా శాఖ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్

వైకుంఠ ద్వార దర్శనాలు ఎప్పటి నుంచి అంటే..!

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలను కల్పించనున్నారు. పరమ పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ 10 రోజుల వ్యవధిలో మొత్తం 8.34 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించినట్లు టీటీడీ సాధికారిక మండలి ఛైర్మన్ ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సాధికారిక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ, వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకే అత్యధికంగా 92 శాతం ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలకు సంబంధించిన ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. తొలి రెండు రోజులు ఎలాంటి సర్వదర్శనం ఉండదని, ఆ తర్వాతి 8 రోజుల పాటు భక్తులకు సర్వదర్శనం అమలు చేస్తామని వివరించారు. భక్తుల సౌకర్యార్థం అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డు సమీపంలోని టీటీడీ స్థలంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.2,750 కోట్లతో అత్యాధునిక యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, డిజైన్ల తయారీ, పర్యవేక్షణ కోసం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయాలని బోర్డు నిర్ణయించింది. అలాగే శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీవారిమెట్టు వరకు రహదారి అభివృద్ధి, ఇంటర్‌లాకింగ్ సిమెంట్ బ్లాక్‌ల నిర్మాణం కోసం రూ.9.50 కోట్లు మంజూరు చేశారు. అలిపిరి నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వరకు రోడ్డుపై నడిచివచ్చే భక్తుల కోసం ఐఐటీ నిపుణుల సహకారంతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు అందించే ప్రోత్సాహక బహుమానాన్ని ఖరారు చేశారు. శాశ్వత ఉద్యోగులకు రూ.16,940, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.8,289 చొప్పున చెల్లించనున్నారు. 2007 సీనియారిటీ జాబితా ప్రకారం ఫేజ్-3 పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి వారసులకు పల్లం గ్రామంలో ఇంటి ప్లాట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. మిగిలిన అర్హుల పరిశీలనకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పాదిరేడు లేఅవుట్ అభివృద్ధికి సంబంధించి గతంలో కేటాయించిన రూ.230 కోట్ల ధ్రువీకరణకు మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారంతో పాటు, భవిష్యత్తులో అర్హులైన ఉద్యోగుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆర్థిక ప్రయోజనం దక్కేలా సూతన సంక్షేమ విధానాన్ని తీసుకురానున్నారు. పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, పాత బకాయిల చెల్లింపులకు గాను స్విమ్స్ ఆసుపత్రికి అదనంగా రూ.41.23 కోట్ల ప్రత్యేక గ్రాంటును కేటాయించారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ సీట్లను 40 నుంచి 60కి పెంచారు.

ఉత్తరాంధ్రకు రెడ్ అలర్ట్



-మొదటిపేజీ తరువాయి

ముందుకు కదులుతూ ఉత్తరాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా తీరాల మధ్య తీరం దాటవచ్చని అంచనా.

ఉత్తరాంధ్రలో వర్ష సూచన

తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. తీర ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

సహాయక బృందాలు సిద్ధం

తుపాను కదలికను ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా యంత్రాంగాలకు ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైన చోట ముందస్తు సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుపాను ప్రభావం దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు తీరానికి చేరుకోవాలని సూచిస్తున్నారు. రైతులు పంటలను కాపాడుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచిస్తున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరుతోంది.

తుపాను గమనంపై నిరంతర నిఘా

అక్వాన్ తుపాను తీరం దాటే ప్రాంతం, తీవ్రత, వర్షపాతం అంచనాలపై వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు బులెటిన్లు విడుదల చేస్తోంది. పరిస్థితులకు అనుగుణంగా జిల్లాల వారీగా హెచ్చరికలు, సహాయక చర్యల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రజలు పదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని యంత్రాంగం సూచిస్తోంది.

ఏపీలో నేటి నుంచి స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు



-మొదటిపేజీ తరువాయి

కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 659 మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. 9 వేలకుపైగా ఎంపీటీసీ స్థానాలు, 659 జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 5న పోలింగ్ జరిగింది. తుపాను ప్రభావం, రీపోలింగ్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో నవంబర్ 6న కూడా ఓటింగ్ నిర్వహించారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించారు. తాజాగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు తేదీలను ఖరారు చేస్తూ ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ

గురువారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల కోసం ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన చేపడతారు. ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే సంబంధిత పదవికి ఎన్నిక నిర్వహిస్తారు. పోటీ లేకపోతే మధ్యాహ్నం 12 గంటలకు ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించి, అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తారు.

రేపు జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక

శుక్రవారం రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. సంబంధిత జడ్పీటీసీ సభ్యులు పరోక్ష పద్ధతిలో తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లతో పాటు వైస్ పదవులకు ఎన్నికైన వారి పదవీకాలం కూడా ఎన్నికైన రోజు నుంచే లెక్కించనున్నారు.

కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక నిబంధనలు

ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం మతపరమైన మైనారిటీ వర్గాలకు లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్సీ మతాలకు చెందినవారు మతపరమైన మైనారిటీలుగా, తెలుగు కాకుండా ఇతర మాతృభాష కలిగినవారు భాషాపరమైన మైనారిటీలుగా పరిగణించబడతారు.

పార్టీ విప్ తప్పనిసరి

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు జారీ చేసే విప్ నిబంధనలు వర్తిస్తాయి. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు పార్టీ విప్ వర్తించదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సంబంధిత పరిషత్‌లలో ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఈ పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు హక్కు ఉండదు.

ఎన్నికల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి, వారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చింది.

అక్వాన్ తుపాను ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి.

- రైతులు పంట రక్షణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.
- కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి పై సమీక్ష.
- ప్రజల భద్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం.



కోటబొమ్మాళి, పెన్ సత్తా, నవంబర్ 18: బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను తీవ్రత ఎక్కువగా ఉండటంతో శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ఈ నెల 19, 20 వ తేదీ వరకు తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.తుపాను పరిస్థితుల పై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి జిల్లాలో పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పునరావాస కేంద్రాలు, కంట్రోల్ రూములను సిద్ధంగా ఉంచాలని సూచించారు. రైతులు పంటల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

భారీ వర్షాల సూచనల నేపథ్యంలో రైతులు ప్రస్తుతం చేపడుతున్న వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యాన్ని కుప్పలుగా చేర్చి, వర్షపు నీరు చేరకుండా, పంట తడవకుండా టార్పాలిన్లు, ఇతర కవర్లతో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ వ్యవసాయ పనుల విషయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్, , విద్యుత్, వైద్య ఆరోగ్య, తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రహదారులపై చెట్లు కూలినప్పుడు వెంటనే తొలగించేలా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు.పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, మందులు వంటి నిత్యావసరాలను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులు కూడా పంటల రక్షణకు ప్రాధాన్యమిస్తూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

సిబ్బంది కి రివార్డులను అందజేసిన నగర పోలీసు కమీషనర్.



విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 18: సిబ్బంది సంక్షేమంతో పాటు, విధుల్లో అందించిన సేవలకు ప్రతిభను గుర్తిస్తూ ఉన్నతాధికారుల సమక్షంలో 260 మందికి నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. క్రైమ్ రివ్యూ మీటింగ్ నందు గత నెల ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ 260 మందికి రివార్డ్ మంజూరు ఆర్డరును అందజేయడం జరిగినది. నగర పోలీసు శాఖ నందు హోంగార్డు నుండి సిఐ స్థాయి అధికారుల వరకూ వారు నిర్వహిస్తున్న విధులకు తగ్గ గుర్తింపు ఇస్తూ, ప్రతి నెలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి తగు రివార్డులు అందజేసి, వారు సమర్ధవంతముగా విధులు నిర్వహిస్తూ తోటి సిబ్బందికి ప్రేరణ ఇస్తూ అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం మరింత సురక్షితముగా ఉండే దిశగా సిపి చర్యలు తీసుకున్న విషయం విధితమే. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ నగరం గుండా రవాణా అవుతున్న గంజాయిని సీజ్ చేసిన పలు కేసులలో, చోరీ కాబడిన సొత్తు,ఇతర వస్తువులను రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసిన పలు కేసులలో, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన కేసులో, సైబర్ క్రైమ్ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 260 మంది, హోం గార్డు నుండి సీ.ఐ వరకూ గల సిబ్బందికి రివార్డులు మంజూరు చేసి, సిబ్బంది అందరూ ప్రేరణ చెంది మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించేలా బుధవారం క్రైమ్ మీటింగ్ కు నందు నగర పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డు మంజూరు ఆర్డరును ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ విజయం కూటమిదే.




టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు.

మంగళగిరి, పెన్ సత్తా, నవంబర్ 18:ఈవీఎంలతో ఎన్నికలు జరిగినా, బ్యాలెట్ పద్ధతిలో జరిగినా ప్రజల మద్దతు కూటమి వైపే ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కూటమి పార్టీల ఉమ్మడి మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు కూటమికి పట్టం కట్టారన్నారు. ఈ విజయంతో ప్రజలు కూటమి ప్రభుత్వం పై ఉంచిన నమ్మకం మరోసారి నిరూపిత మైంది. ఇదే విజయ స్ఫూర్తిని రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో కూటమిని ఆశీర్వదించినట్లుగానే, గ్రామాల్లోనూ కూటమి బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో డబుల్ ఇంజిన్ సర్కార్ పనిచేస్తోంది. స్థానిక సంస్థల్లోనూ కూటమికి ప్రజలు మద్దతు ఇస్తే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు కలిసి పనిచేసే ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడుతుంది. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరుతాయి. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయంగా, సామాజికంగా వారికి మరింత ప్రాధాన్యం కల్పించాం. తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం, నీటి సంక్షోభం వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ ప్రభుత్వం సమర్థవంతంగా పరిస్థితులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతోంది.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నికలను రిగ్గింగ్ ద్వారా గెలవాలనే ధోరణి కనిపించింది. పులివెందులలో కూడా దశాబ్దాలుగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితులు లేవు. నేడు ప్రజలు స్వేచ్ఛగా బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుని కూటమికి మద్దతు తెలిపారు. ప్రజాస్వామ్యం పై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో మూడు పార్టీల నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్తారు. గ్రామ స్థాయి లోనూ, మండల స్థాయి లోనూ చర్చలు జరిపి, ప్రజల్లో ఆదరణ ఉన్న, సమర్థత కలిగిన అభ్యర్థులను గుర్తించి వారికి అవకాశం కల్పిస్తాం. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. కాబట్టి మూడు పార్టీల మధ్య అవగాహనతో రెబల్ అభ్యర్థులు లేకుండా, ఉమ్మడి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించాం. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, మండల స్థాయిల్లో ఇప్పటికే సమన్వయ ప్రక్రియ కొనసాగుతోంది. అన్ని స్థాయిల్లో కలిసికట్టుగా పనిచేస్తూ 100 శాతం విజయ లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. కూటమి ధర్మాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త పాటించాలి. వ్యక్తిగత అభిప్రాయాల కంటే కూటమి విజయం, ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని అందరూ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

నా ప్రాణం ఉన్నంత వరకు కార్యకర్తలు అభిమానుల వెన్నెంటే ఉంటా

- నా సోదరుడు పార్టీని వీడినంతమాత్రాన పార్టీ కి వచ్చే నష్టమేమీ లేదు
- కుటుంబంలో చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు
- త్వరలోనే హోంమంత్రి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ..



నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 18:నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు నన్ను నా కుటుంబాన్ని పార్టీ ని నమ్ముకున్న కార్యకర్తలు, అభిమానులకు నిరంతరం అండగా ఉంటానని వైఎస్ ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం ఆయన నక్కపల్లి లో విలేకరులు తో మాట్లాడు తూ తన సోదరుడు వైఎస్ ఆర్ సీపీ నుంచి ఎంపీ టిసి గా గెలుపొందిన వీసం నానాజీ టిడిపి లో చేరినందు వల్ల వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టం ఏమి లేదన్నారు. అన్నదమ్ములు మధ్య,కుటుంబాల్లో ను చిచ్చు పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని నీచ రాజకీయాలు చేస్తున్న హోం మంత్రి అనిత త్వరలో నే తగిన మూల్యం చెల్లించు కుంటారున్నారు. ఇటువంటి నీచ రాజకీయాలకు తాను భయపడే ప్రసక్తే లేదన్నారు. పదవులు ఆశించి ఒక్కడు పార్టీ వీడినంత మాత్రాన కార్యకర్తలు అధైర్యం పడొద్దన్నారు. కార్యకర్తలకు అభిమానులకి అండగా ఉంటానన్నారు. నాకు వ్యక్తులు కాదని పార్టీ ముఖ్యమన్నారు. ఇన్నాళ్లు నైతిక విలువలతో కూడిన రాజకీయం చేసానని ఇకపై కూడా అలాగే రాజకీయాలు చేస్తానని పేర్కొన్నారు. కార్యకర్తలకి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని ప్రాణాలకి తెగించి అయిన సరే వారి సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. అధికార పార్టీ ని పదవులని చూసి భయ పడే ప్రసక్తే లేదన్నారు. నన్ను పార్టీ ని నమ్ముకున్న వారికి అండగా ఉంటామన్నారు.ప్రతి పక్షం లో ఉంటూ ప్రజలు కోసం కార్యకర్తలు కోసం పోరాటం చేయడం తనకి అలవాటే నన్నారు. ప్రలోభాలకి లొంగి పోతే ఏ నాడో పెద్ద పదవులు దక్కెవన్నారు. నన్ను నమ్ముకున్న పార్టీకి కార్యకర్తలు పక్షనే ఉంటానన్నారు. ఐటీ వల జరిగిన ఎంపీ టిసి ఎన్నికల్లో పార్టీ పట్ల మా పట్ల నమ్మకం తో ఓటు వేసి ఎంపీటిసి లు గా గెలిపించారని వారందరికి అండగా నిలబడతనన్నారు. అధికార పార్టీ నాయకులకి హోం మంత్రి కి నా ఒక్కడి నే రాజకీయం గా ఎదుర్కొనే సత్తా లేక నా కుటుంబం లో చిచ్చు పెట్టారన్నారు

ఎవరి తో నైనా పోరాటం చేసేందుకు కు సిద్ధంగా ఉన్నానన్నారు. వెన్నుపోటు రాజకీయాలు కి భయపడే ప్రశక్తి లేదని మీ అందరికీ వీసం రామకృష్ణ అండగా ఉన్నాడనే ధైర్యంతో కార్యకర్తలు అభిమానులు ఉండాలని ఆయన సూచించారు.

పోలీసులే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే..రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?

విజయవాడ:పెన్ సత్తా, నవంబర్ 18: పంచాయతీ ఎన్నికల్లో కూటమి నేతలు నామినేషన్లు వేయకుండా వైయస్ఆర్‌సీపీ మద్దతుదారులను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం, పోలీసులు లాఠీచార్జ్‌లు, హౌస్ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వైయస్ఆర్‌సీపీ నేతలు మండిపడ్డారు. పులివెందుల, రాయచోటి, పెదకూరపాడు, పుంగనూరు తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన ఆధారాలతో విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాగిరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయని పోలీసు, అధికారులపై చర్యలు తీసుకోకపోతే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

మీడియాతో వైయస్ఆర్‌సీపీ నేతలు ఏమన్నారంటే..

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు: మల్లాది విష్ణు, మాజీ ఎమ్మెల్యే

మొదటి దశ నుంచే పంచాయతీ ఎన్నికల్లో జరుగుతున్న అప్రజాస్వామిక ఘటనలపై మేము ప్రతిరోజూ ఎన్నికల కమిషన్‌కు ఆధారాలతో ఫిర్యాదులు ఇస్తూనే ఉన్నాం. అయినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల అండతో నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, గ్రామాల్లో ఘర్షణలకు తెరతీయడం కొనసాగుతోంది. పల్లెల్లో పచ్చదనం పోయి రౌడీయిజం వచ్చింది. ప్రజలు దౌర్జన్యాలకు, పోలీసుల దాష్టికానికి గురవుతున్నారు.

పులివెందుల నుంచి పెదకూరపాడు వరకు అదే తంతు

రెండో దశలో పులివెందులలో హింస, రౌడీయిజం, హౌస్ అరెస్టులపై వీడియో ఆధారాలతో ఫిర్యాదు చేశాం. పులివెందులలో బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గాలు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నా అక్కడి అధికారులు ఏం చేస్తున్నారు? ఒక మండలంలో 17 పంచాయతీలు ఉంటే ఐదు పంచాయతీల్లో మాత్రమే నామినేషన్లు వేయగలిగిన పరిస్థితి ఎందుకు వచ్చింది? పెదకూరపాడులో మహిళలపై పోలీసులు లాఠీచార్జ్ చేసిన దృశ్యాలు కూడా ఉన్నాయి. రైతు నాయకుడు ప్రసాద్‌రెడ్డిపై దాడి జరిగింది. వైయస్ఆర్‌సీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేస్తూ, అడ్డుకునే వారిని మాత్రం స్వేచ్ఛగా వదిలేయడం ఏ న్యాయం? ఎక్కడ నామినేషన్లు అడ్డుకున్నారో అక్కడ రేపు పోలీసు భద్రతతో నామినేషన్లు వేయించాలి.

పోలీసుల తీరుపై స్వతంత్ర పరిశీలన అవసరం: ఎం. మనోహర్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

ఎన్నికల కమిషన్ మాటలను కింది స్థాయి పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదనేది మా ప్రధాన సమస్య. ఇది కేవలం మాట కాదు.. ఆధారాలతో చెబుతున్నాం. పోలీసు, ఎస్పీ, కలెక్టర్ నివేదికలపైనే ఆధారపడకుండా ఎన్నికల కమిషన్ స్వయంగా పరిశీలించాలి. స్వతంత్ర దర్యాప్తు బృందాలు లేదా ఎన్నికల పరిశీలకులను నియమించి ఎక్కడ అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారో తేల్చాలి. బాధ్యులైన ఎస్పీలు, డీజీపీ స్థాయి అధికారులపై చర్యలు తీసుకుని ఎన్నికల విధులకు దూరం చేయాలి. రెండో దశలో మిగిలిన నామినేషన్ రోజుల్లో అన్ని కేంద్రాల్లో స్వేచ్ఛగా నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలి.

ఎన్నికల ప్రక్రియపై నమ్మకం నిలబెట్టాలి

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అభ్యర్థి హక్కు. ఆ హక్కును అడ్డుకునేలా నామినేషన్ల దశలోనే దౌర్జన్యాలు, హౌస్ అరెస్టులు, లాఠీచార్జ్‌లు చోటుచేసుకుంటే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? ఇప్పటికే ఫిర్యాదులు, వీడియో ఆధారాలు ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లాయి. కాబట్టి క్షేత్రస్థాయిలో పరిస్థితిని స్వయంగా పరిశీలించి, నామినేషన్లు అడ్డుకున్న ప్రాంతాల్లో పోలీసు భద్రత కల్పించి ప్రక్రియను పూర్తి చేయాలి. ప్రజాస్వామ్య ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన స్వతంత్రతను చాటుకోవాలి.

రేపటిలోగా పరిస్థితిని సరిచేయాలి: ఎంవీఎస్ నాగిరెడ్డి, వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి(రైతు విభాగం)

ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది. కానీ ఆ చర్యలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఈరోజు కూడా ఏ జిల్లా, ఏ మండలం, ఏ గ్రామంలో సమస్య జరుగుతుందో స్పష్టమైన ఆధారాలతో ఇచ్చాం. నామినేషన్ వేసే అభ్యర్థులను పోలీసు భద్రతతో కేంద్రానికి తీసుకెళ్లి నామినేషన్లు వేయించాలి. నామినేషన్ కూడా వేయలేని పరిస్థితి ఉంటే ప్రజాస్వామ్యం మొత్తం ఖూనీ అవుతుంది. రేపటిలోగా పరిస్థితిని సరిచేయాలి. లేకపోతే ప్రజలతో కలిసి మేము తదుపరి కార్యాచరణలోకి వెళ్లాల్సి వస్తుంది.

ఎస్ఈసీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వారిలో వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీలు కల్పలత, రమేష్‌యాదవ్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి, బూత్ కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వంగల భరత్‌కుమార్‌రెడ్డి, బొందిలి విభాగం నేత నరేందర్‌సింగ్, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ యోహాన్‌రాజు ఉన్నారు.

పులివెందుల ఎన్నికలపై హైకోర్టు ఉత్తర్వులు ప్రభుత్వానికి చెంపపెట్టు

తాడేపల్లి: పెన్ సత్తా, నవంబర్ 18: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, పులివెందుల పరిధిలోని 21 పంచాయతీల్లో నామినేషన్లను పోలీసుల సాయంతో టీడీపీ గూండాలు అడ్డుకోవడం దారుణమని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ఆయా పంచాయతీల్లో పోలీసుల ఎస్కార్ట్ తో నామినేషన్లు వేయించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని ఆయన స్వాగతించారు. రాష్ట్రంలో చంద్రబాబు, ఎన్నికల కమిషన్, పోలీసుల కుమ్మక్కును ప్రజలు గమనించాలని అంబటి రాంబాబు ప్రజల్ని కోరారు. అలాగే రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టిన అంబటి రాంబాబు.. ఆయన ఏమైనా ప్రజలకు సేవచేశారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చంద్రబాబు ఆ జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రెస్ మీట్లో అంబటి రాంబాబు ఇంకేమన్నారంటే..:

అధికార కూటమితో ఎస్ఈసీ కుమ్మక్కు:

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎంత ఘోరంగా జరిగాయో మనం చూశాం. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైనా ఫర్వాలేదు కానీ.. ఇక్కడ అధికార కూటమితో కుమ్మక్కు అయిపోయింది. చిత్రం ఏంటంటే.. ఎన్నికలు జరగడం, నామినేషన్లు వేయడం, ఓట్లు అడగటం, పోలింగ్ జరగడం, ఓట్లు లెక్కించడం ఇవన్నీ పక్కనబెట్టేసి ఏకగ్రీవాలవైపు నడుస్తోంది. వైఎస్సార్సీపీకి సంబంధించిన వారు నామినేషన్లు దాఖలు చేస్తే నామినేషన్ పత్రాలు చించేయడం, దౌర్జన్యాలు చేయడం చూశాం. ఇప్పుడు పంచాయతీలకు సంబంధించిన ఎన్నికల్లో గుర్తులుండవు. కేవలం సానుభూతిపరులు మాత్రమే పోటీ చేస్తారు. వీటిలో మొదటి దశ అయిపోయింది, రెండో దశ జరుగుతోంది, మూడో దశ జరగాల్సి ఉంది. వీటిలోనూ తీవ్రమైన అరాచకం జరుగుతోంది. నామినేషన్ పత్రాలు తీసుకుని నామినేషన్ వేయడానికి వెళ్లిన వాళ్లను వెన్నుపోటు పార్టీ కార్యకర్తలు కొడతారు, పోలీసులు పక్కనే ఉండి వారికి రక్షణ ఇస్తారు. పత్రాలు చించేసిన తర్వాత మిమ్మల్ని తరిమి కొడతారు. ఇదంతా ఓ కాంట్రాక్టు పద్ధతిలో జరుగుతోంది. ఎన్నికల్లో నామినేషన్లు వేయడం, ఓట్లకు డబ్బులివ్వడం, కొనడం అంతా అనవసరం, పోలీసుల్ని కొందాం, అధికారుల్ని కొందాం సింపుల్ గా అయిపోతుందన్న వ్యాపార పద్ధతిలో చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికల్ని నడుపుతున్నారు.

పులివెందులలో మరోసారి ప్రజాస్వామ్యం ఖూనీ:

రాష్ట్రంలో ఇవాళ కూడా పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ కేంద్రాలకు వెళ్తున్న వైఎస్సార్సీపీ సానుభూతిపరుల్ని కొట్టడం, తలలు పగులగొట్టడం చేశారు. పులివెందులలో సైతం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కార్యక్రమం మొదలుపెట్టారు. సుమారు 21 పంచాయతీల్లో ఇవాళ వైఎస్సార్సీపీ సానుభూతిపరులు నామినేషన్లు వేయలేకపోయారు. అంటే వారు వేయలేకపోవడం కాదు, నామినేషన్ వేయడానికి వెళ్లిన వైఎస్సార్సీపీ సానుభూతిపరుల్ని పోలీసుల సాయంతో టీడీపీ గూండాలు కొట్టారు. వెంటనే అక్కడున్న స్థానిక ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పోలీసుల్ని సంప్రదించి, వీళ్లను అడ్డుకోమని పదే పదే చెప్పినా ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో వేంపల్లె సర్పంచ్ అభ్యర్థి షబ్బీర్ వలీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో వాద ప్రతివాదనలు విన్న తర్వాత ఓ చక్కటి తీర్పు వచ్చింది. ఈ 21 పంచాయతీల్లో అభ్యర్థుల్ని పోలీసు ఎస్కార్ట్ తో తీసుకెళ్లి నామినేషన్లు వేయించే బాధ్యత ఎన్నికల కమిషన్ దే, పోలీసు శాఖదే అని హైకోర్టు తేల్చిచెప్పింది. అంతే కాదు తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేశారు. హైకోర్టు జోక్యంతో అయినా పులివెందులలో పరిస్థితి కొంత మెరుగుపడుతుందని భావిస్తున్నాం. ఇంత దుర్మార్గమైన, అరాచకమైన ఎన్నికల్ని చంద్రబాబు, ఎన్నికల కమిషన్, పోలీసులు కలిపి జరుపుతుంటే ప్రజాస్వామ్యం ఎక్కడికి పోతుందో ఆలోచించుకోవాల్సిన బాధ్యత ప్రజలు, మేధావులపై ఉంది. ఇలాంటి దౌర్భాగ్యమైన పరిస్థితులు ఏపీలో, దేశంలో వస్తాయని ఎప్పుడూ అనుకోలేదు. ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామంగా కనిపిస్తోంది. న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తే తప్ప న్యాయం జరగని పరిస్థితి ప్రతీచోటా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్ని ప్రజలు కూడా అర్థం చేసుకోవాలని కోరుతున్నాం.

మీడియా ప్రశ్నలకు జవాబిస్తూ ...

రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో అర్థం కావట్లేదు. రామోజీరావు వ్యాపారవేత్తే కానీ సమాజ సేవకుడు కాదు కదా. ఆయన సమాజానికి ఏమైనా సేవ చేశారా ? సామాన్యుడిని ఏమైనా ఆదుకున్నారా ? ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచిన సమయంలో చంద్రబాబుకు రక్షణగా ఉన్న వ్యక్తి ఆయన. అక్రమంగా, అన్యాయంగా కథలు రాసి ప్రజల్ని డైవర్ట్ చేసిన వ్యక్తి మాత్రమే. రామోజీ రావు చనిపోతే ఆయన వర్ధంతి చేయడానికి రూ.10 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చుపెట్టారు.

ఏదో సామెత చెప్పినట్లు గోంగూర దొంగతనం జరిగినప్పుడే ఆపితే పోయేది. రామోజీరావు వర్ధంతి సభను ప్రభుత్వం 10 కోట్లతో ప్రభుత్వం నిర్వహించినప్పుడే విజ్ఞులైన ప్రజలు తిరుగుబాటు చేస్తే బావుండేది. కానీ ఇప్పుడు ప్రతీ సంవత్సరం ప్రభుత్వ ధనంతో ప్రజలు రామోజీరావు జయంతిని పండగ చేసుకోవాలంట. ఆయన ఏమైనా డబ్బుల్లేని వారా, వావిలాల గోపాలకృష్ణయ్యా, ప్రకాశం పంతులా.. దేశాన్ని దోచుకున్న వ్యక్తి, వ్యాపారాల్లో మోసం చేసిన వ్యక్తి. అలాంటి వ్యక్తిని దేశాన్ని, రాష్ట్రాన్ని ఉద్ధరించే మహానుభావుడిగా భావించి ఆయనకు జన్మదినాలు పండుగలా చేసుకోవాలంటున్నారంటే.. రాష్ట్రంలో పాలన ఓ జోక్ అయిపోయిందని అర్థమవుతోంది. ఇప్పటికైనా చంద్రబాబు ఈ జీవోను ఉపసంహరించుకోవాలి. లేదు రామోజీ మా వాడు, మేం పండగలు చేస్తాం అంటే.. మీరు ఎల్లకాలం వాటిని చేయలేరు, కేవలం రెండేళ్లు మాత్రమే చేయగలరు. రామోజీ రావు ఎలాగో పోయారు, మీకు కూడా పోయేకాలం వచ్చినట్లుగా కనిపిస్తోంది. అధికారం ఉంది కదా అని ఇలాంటి దుర్మార్గమైన కార్యక్రమాలు చేయడం దురదృష్టకరం. రామోజీరావు గారిని మేం ఏమీ కించపర్చడం లేదు. రామోజీరావు చాలా గొప్పోడు. కానీ ఆయన కుటుంబానికి మాత్రమే. బ్రహ్మాండమైన వ్యాపారాలు చేసి ఆయన కుటుంబ సభ్యులకు ఆస్తులు ఇచ్చుకున్నాడు. దానికి మాకేం అభ్యంతరం లేదు. కానీ ఆయన తెలుగుజాతికే గొప్పోడు అంటే ఎలా ? రామోజీరావు గొప్పోడైతే టీడీపీ వాళ్లు తమ ఆఫీసుల్లో, లేదా హెరిటేజ్ ఆఫీసుల్లో డబ్బులు తీసుకొచ్చి పండగలు చేసుకోండి, ప్రభుత్వ ధనం వెచ్చించి రామోజీ రావు పండగ చేసుకోండి అనడం పరమ దుర్మార్గం. రామోజీరావు మీద చాలా కేసులున్నాయి, వాటిని నిరూపణ కాలేదని కోర్టులు కొట్టేయలేదు. ఆయన చనిపోయాడు కాబట్టి కొట్టేశారన్నది గుర్తుంచుకోవాలి.

మత్స్యకార సోదరులు చెప్పిన మాటలు నన్ను కలచివేశాయి

వైయస్ఆర్సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి

తాడేపల్లి: పెన్ సత్తా, నవంబర్ 18: వైయస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్రెడ్డిని బుధవారం పలువురు మత్స్యకారులు కలిశారు. ఇవాళ జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా నష్టపోయామంటూ తమ సమస్యలను చెప్పుకున్నారు. దీనిపై వైఎస్ జగన్ ట్వీట్ చేసి.. ఈ ప్రభుత్వం ఆదుకోకపోతే, వైయస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదుకుంటామని ధైర్యం చెప్పారు.“ప్రకాశం జిల్లా, కొత్తపట్నం మండలం, కె.పల్లెపాలెంలో ఈ రోజు తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో మత్స్యకారుల వలలు, వేట సామగ్రి కాలిపోయి రూ.5 కోట్ల మేర ఆస్తినష్టం జరిగి 300 మత్స్యకార కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీసింది. వేటకు పెట్టుకున్న వలలన్నీ కళ్లముందే కాలిపోయాయని ఈ రోజు నన్ను కలిసిన మత్స్యకార సోదరులు చెప్పారు. వారి మాటలు నన్ను కలచివేశాయి.చంద్రబాబు.. రోజూ వేటకు వెళ్తేగాని ఇల్లు గడవని కుటుంబాలివి. నష్టాన్ని వెంటనే అంచనా వేసి, బాధిత కుటుంబాలన్నింటికీ పూర్తి నష్టపరిహారం చెల్లించాలని మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఈ సందర్భంగా మత్స్యకార సోదరులకు హామీ ఇస్తున్నా. ఈ ప్రభుత్వం మిమ్మల్ని ఆదుకోకపోతే, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నష్టపరిహారం మనం అందించి ఆదుకుంటాం.. అధైర్యపడకండి” అని వైయస్ జగన్ తెలిపారు.

గ్రామ పంచాయితీ ఎన్నికల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి.





జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్.


అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 18: వార్డు, గ్రామ పంచాయితీ ఎన్నికల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి, గ్రామాలలో ఎన్నికలు ప్రశాంత మైన వాతావరణంలో జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, జిల్లా అధికారులతో జిల్లా పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వీలైనన్ని ఎక్కువ ఏకగ్రీవ ఎన్నికలు జరిగితే గ్రామాల అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి రూరల్ మినహా మిగిలిన అన్ని చోట్లా కూడా 10 కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, చివరి నిమిషము వరకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీస్ రెస్పాండ్ అయ్యారని కలెక్టర్ తెలిపారు. ఈసారి మొదటి ఫేజ్ లో 415, రెండవ ఫేజ్ లో 453, మూడవ పేజ్ లో 373 లొకేషన్లలో పోలింగ్ స్టేషన్లు పెట్టామని, మొదటి పేజ్ లో 2,197 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీడీవోలు ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే అధికారులు పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ విషయంలో ఎక్కడెక్కడ ఓటర్ శాతం తగ్గిందో అక్కడ రాజకీయ వర్గాల నుంచి వస్తున్న విమర్శలను దృష్టిలో పెట్టుకుని సరైన అవగాహన కల్పించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణ, బ్యారికేడింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ పై దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ స్టేషన్లలో (మొదటి పేజ్ లో 2,197 పోలింగ్ స్టేషన్లు, సెకండ్ పేజ్ లో 2092, థర్డ్ పేజ్ లో 2046 పోలింగ్ స్టేషన్లు) నిబంధనల ప్రకారం పకడ్బందీగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలలని, ఫేజ్-1 పరిధిలోని అనకాపల్లి, నర్సీపట్నం రోడ్డు ప్రాంతాల్లోని అధికారులు సమన్వయంతో వ్యవహరించి, రాగల మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని మండలాల పరిధిలో ఓటర్ స్లిప్పుల పంపిణీని రాగల 48 గంటల్లో పూర్తి చేసి, డివిజనల్ అధికారులకు కన్ఫర్మేషన్ రిపోర్ట్ అందించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ లోనూ పంచాయతీ రాజ్ సిబ్బంది పోలింగ్ సిబ్బందికి, అధికారులకు భోజనం ఏర్పాటు, మంచి నీరు, వాష్‌రూమ్‌లు, ఏర్పాటు చూసే బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిజిటల్ అసిస్టెంట్లు మరియు పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ (జీపీ) ఎన్నికలు మరింత క్లోజ్ కంటెస్ట్ గా ఉండే అవకాశం ఉన్నందున, అందరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను కోరారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అలాగే పోలింగ్ కేంద్రాల బయట ఓటర్ల లైన్లు ఉండే చోట వీడియోగ్రాఫర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతా పరంగా బౌండరీ గోడలు లేకపోవడం లేదా కొన్ని ఓపెనింగ్స్ ఉండటం వల్ల భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని, వీటికి తాత్కాలిక ఫెన్సింగ్ లేదా బౌండరీ గోడల ఏర్పాటును పోలీసు విభాగంతో సమన్వయం చేసుకొని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గత ఎన్నికలలో కొన్ని చోట్ల ఓటరు స్లిప్పులు అందక పోవడంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉందని, ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రైవేట్ వ్యక్తులు కాకుండా ప్రభుత్వ అధికారులు, బీఎల్ఓల ద్వారానే ఓటరు స్లిప్పుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. గత ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సెస్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్ కోసం తగినన్ని వాహనాలు సమకూర్చాలని, ఆర్టీవో అధికారుల నుంచి గతంలో లాగే ఈసారి కూడా మంచి సహకారం ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. పోలీసు బందోబస్తు ఇప్పటికే సిద్ధం చేయబడిందని, హైపర్ సెన్సిటివ్ మరియు సెన్సిటివ్ ప్రాంతాలను పరిగణలోకి తీసుకొని తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పూర్తి విశ్వాసంతో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

రీ-సర్వే పనులను వాయిదా వేస్తున్న అధికారులకు తగిన స్పష్టత.





జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 18: గత కొంతకాలంగా భూ రీ-సర్వే పనులను పూర్తి చేయకుండా, గడువులను వాయిదా వేస్తున్న అధికారులకు బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో తగిన స్పష్టత ఇచ్చిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ? గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న, లేదా వాయిదా పడిన అన్ని పనులను ఈ డిసెంబర్ నెల లోపు పూర్తి చేసి ప్రింటింగ్ కు పంపాలి అని ఆదేశించారు. డిసెంబర్ 5 లోపు లేదా ఆ నెల లోపు క్లోజ్ చేస్తేనే తప్ప, లేదంటే ఆ సైకిల్ మిస్ అవుతామని చెప్పారు.

గ్రూప్‌లో షేర్ చేసిన 81 గ్రామాల రీ-సర్వే పనులను జేసీ లాగిన్‌లో ఈ నెల చివరి నాటికి పూర్తిగా క్లోజ్ చేయాలని ప్రతి మండలం లోని అధికారులు తమకు కేటాయించిన గ్రామాల జాబితా ప్రకారం ఈ పనులను సక్రమంగా పూర్తి చేయాలని చెప్పారు. చోడవరం, కశింకోట, మునగపాక, పరవాడ, యలమంచిలి, నర్సీపట్నం వంటి మండలాలకు జనవరి సైకిల్‌లో ఎలాంటి టార్గెట్లు లేవని. వీరు ఫిబ్రవరికి సంబంధించిన పనులను ముందే అడ్వాన్స్‌గా పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నర్సీపట్నం మినహా మిగిలిన అన్ని మండలాలకు జనవరి సైకిల్‌లో ఎలాంటి టార్గెట్లు లేవని. నర్సీపట్నం మండలంలో మాత్రం ఫిబ్రవరి సైకిల్‌కు సంబంధించిన ఒక గ్రామం ఉంది, దాన్ని ఈ నెల లోపే పూర్తి చేసి క్లోజ్ చేయాలని చెప్పారు. అలాగే జాయింట్ కలెక్టర్ లాగిన్ నుంచి పెండింగ్‌లో ఉన్న కొన్ని గ్రామాలను వెరిఫికేషన్ కోసం కలెక్టరేట్‌కు తెప్పించి రెండు మూడు రోజుల్లో క్లోజ్ చేయాలని ఆదేశించారు. అనకాపల్లిలో 76, నర్సీపట్నంలో 46, మరో మండలంలో 31 చొప్పున పెండింగ్‌లు ఉన్నాయన్నారు. దేవరాపల్లి, పరవాడ వంటి మండలాల్లో పెద్దగా పెండింగ్‌లు లేవని, మిగిలిన కొన్ని మండలాల్లో ఉన్న పెండింగ్‌లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్‌కు సంబంధించిన పనులు సక్రమంగానే జరుగుతున్నాయని, అత్యధిక రిజెక్షన్‌లు మరియు పెండింగ్‌లు ఉన్న కె. కోటపాడు, చోడవరం, బుచ్చయ్యపేట, దేవరాపల్లి, రావికమతం వంటి ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా కె. కోటపాడు మండలంలో ఉన్న మ్యుటేషన్ పెండింగ్‌లను త్వరగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. రీ-సర్వే పనులను కె. కోటపాడు, చోడవరం, దేవరపల్లి వంటి ప్రాంతాల్లో ఉన్న పెండింగ్‌లను వెంటనే క్లోజ్ చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి పెండింగ్‌లు ఉండకూడదని ఆదేశించారు. ?జాయింట్ కలెక్టర్ లాగిన్ లో వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అన్ని వివరాలు జాయింట్ కలెక్టర్ లాగిన్‌లోనే కనిపించాలి గానీ, కింద స్థాయి అధికారుల లాగిన్‌లో ఉండకూడదని తెలిపారు. పట్టాదారి పాస్‌పుస్తకాల పంపిణీని రెండు రోజుల్లో పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకూడదని చెప్పారు. కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు కంప్లైయన్స్ ఇవ్వాలని, లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆదేశించారు. మీ-సేవ, మ్యుటేషన్, అప్లైన్ పిటిషన్లకు సంబంధించిన పోర్టల్ సమస్యలను సరిచేసి, వచ్చే బుధవారం నాటికి అన్ని పెండింగ్‌లను క్లియర్ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అనకాపల్లి, పాయకరావుపేట మండలాల్లోని రీ-సర్వే కేసులు త్వరగా పూర్తి చేసి నివేదికను కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ ఫలితాలు వచ్చి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఆశించిన స్థాయిలో పురోగతి లేదని, కానీ రెవెన్యూ క్లీనింగ్‌లో 3,000 కేసులు ఉన్నాయని, వాటిని క్లోజ్ చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ నెలలో ఇన్‌స్పెక్షన్లు తక్కువగా ఉన్నాయని, రాబోయే 15 రోజుల్లో మిగిలిన ఇన్‌స్పెక్షన్‌లను పూర్తి చేయాలని తహశీల్దార్లను కోరారు. రైస్ డిస్ట్రిబ్యూషన్ (బియ్యం పంపిణీ): మంచి క్వాలిటీ ఉన్న బియ్యం సుమారు 50% సబ్సిడీ రేటుతో ఇవ్వబడుతున్నాయని, ఇది చాలా మంచి నిర్ణయమని తెలిపారు. రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు ద్వారా ఒక ఇంటికి ఒక మనిషికి ఒక బ్యాగ్ (26 కేజీలు, రూ. 1,300 విలువైనది మార్కెట్లో రూ. 2,300 ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి కాల్‌సెంటర్ షెడ్‌లో కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఎక్కడైతే వాహనాలు లేవో అక్కడ ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసి ప్రతి బస్తాకు రూ. 10 ఇన్సెంటివ్ ఇస్తున్నామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వేలో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ సోమవారం ఉదయం నాటికి తప్పకుండా క్లోజ్ చేయాలన్నారు. సోమవారం సాయంత్రం లేదా మంగళవారం ఉదయం నాటికి పూర్తిచేయాలని లేని పక్షాన తగు ఆదేశాలు జారీ చేయబడతాయని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్ ఉంచకూడదని స్పష్టం చేశారు. విఆర్ఓ, విలేజ్ సర్వేయర్లు అందరూ ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని గుర్తించే ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని. ఇళ్లు కట్టడానికి అనుకూలంగా ఉండే సరైన ప్రభుత్వ భూమిని గుర్తించి, లొకేషన్‌లను త్వరగా ఫైనలైజ్ చేయాలని. ఇది పూర్తయిన వెంటనే హౌస్‌సైట్ పట్టాల పంపిణీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. ? సివిల్ సప్లైస్ సంబంధించి ఎస్ఎల్పీ దాటిన కేసులు గతంలో కంటే పెరిగాయని. వీటిని తక్షణమే క్లోజ్ చేయాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో సీబీడీసీ పనులు 90% పైగా పూర్తయితే, మరికొన్ని మండలాల్లో కేవలం 18-20% మాత్రమే అయ్యాయని. తక్కువ పురోగతి ఉన్న మండలాలు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పూర్తి చేయాలని, లేదంటే తగిన చర్యలు ఉంటాయని చెప్పారు. రైస్ కార్డ్ మ్యాపింగ్: సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ కింద రైస్ కార్డ్‌కు సంబంధించి ఫోన్ నంబర్ల మ్యాపింగ్ ప్రక్రియ జరిగిందని. ఇప్పటి వరకు 50% మాత్రమే పూర్తయినందున, మిగిలిన 50% కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఈ-కేవైసీ ప్రక్రియ ఇంకా 1.75% పెండింగ్‌లో ఉందని. తహశీల్దార్లు డెత్, మైగ్రేటెడ్ కేసులు క్లియర్ చేయాలని, మైగ్రేటెడ్ అయిన వారికి ఫోన్ నంబర్లు లేదా వాట్సాప్ ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. త్వరలోనే కమిషనర్ ఆదేశాల ప్రకారం ఈ పెండింగ్‌లు అన్నీ క్లోజ్ చేయబడతాయి తెలిపారు. అనకాపల్లి, పాయకరావుపేట లో కౌంటర్లు ఏర్పాటు చేశామని, 'ధరణి' అనే రైస్‌తో కౌంటర్లు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 1,700 టన్నులు డిస్ట్రిబ్యూషన్ చేశామని తెలిపారు. ?

రైస్ నాణ్యత, రకాలు: రేషన్ బియ్యం 50 కేజీల బస్తాగా, 49 బీపీటీ రైస్‌గా ఇవ్వబడుతోందని. కర్నూలు వెరైటీని నేరుగా సప్లై చేస్తున్నామని, దీనికి మంచి స్పందన వస్తోందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి కాల్‌సెంట్ షెడ్‌లో ఒక కౌంటర్ పెట్టాలని నిర్ణయించి, అదనంగా మరో 6 అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఎక్కడైతే వాహనాలు పెట్టలేకపోతున్నామో, ఆ మండలాలకు ఎండీయూలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి మండలానికి ఒక ఎండీయూ చొప్పున 24 ఎండీయూలను ఐడెంటి ఫై చేశామని చెప్పారు. వీటికి ప్రతి బస్తాకు రూ. 10 ఇన్సెంటివ్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ వో వై సత్యనారాయణ రావు, నర్సీపట్నం ఆర్డీవో రమణ, అనకాపల్లి ఆర్డీవో శ్రీనివాస్, అడ్డరోడ్డు ఆర్డిఓ రామలక్ష్మి, డీఎస్ఓ మూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సర్పంచ్ : పదవి మాత్రమే కాదు.. ఊరి గుండె చప్పుడు!



పల్లెటూరి రాజకీయాల్లో 'సర్పంచ్' అనే మూడు అక్షరాలకు ఉండే పవర్, క్రేజ్ వేరే లెవల్. ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు ఉండే స్థాయి వేరు కావచ్చు కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమై, ప్రతి ఇంటి గడపతో సంబంధం కలిగి ఉండే ఏకైక రాజ్యాంగబద్ధమైన పదవి సర్పంచ్. లక్షలు, కోట్లు ఖర్చు పెట్టి మరీ ఆ కుర్చీలో కూర్చోవాలని ఎందరో ఆరాటపడటానికి కారణం కేవలం అధికారం మాత్రమే కాదు, దాని వెనుక ఉండే ప్రెస్టేజ్ (హోదా), మానసిక సంతృప్తి, ఊరిపై ఉండే తిరుగులేని ఆధిపత్యం ప్రధాన కారణంగా చెప్పొచ్చు. సర్పంచ్ పదవిలో ఉండే అసలైన కిక్, ఆ పదవితో వచ్చే గౌరవం కోసం ఒక ప్రణాళికబద్ధంగా పనిచేస్తుంటారు. ప్రభుత్వం తరఫున వచ్చే వేతనం తక్కువే అయినప్పటికీ, ఆ పదవి ద్వారా వచ్చే మానసిక సంతృప్తి రూపాయల్లో వెలకట్టలేనిదిగా చెబుతారు. ఇక రాజ్యాంగ ప్రకారం కూడా దేశానికి రాష్ట్రపతి ప్రథమ పౌరుడు అయితే, గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచే.. అంతేకాదు ప్రభుత్వంలో ఎవరికీ లేని చెక్ పవర్ గ్రామ సర్పంచ్ సొంతం. ఈ ఒక్క పవర్ ఆ పదవికి ఉన్న ప్రతిష్టను ఇనుమడింపజేస్తుందని అంటున్నారు.

ఊరి పెద్దగా దక్కే రాజభోగం

గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా, ఏ వివాదం తలెత్తినా అందరి చూపు మొదట పడేది సర్పంచ్ పైనే. ఊరిలో పెళ్లయినా, పండగైనా, జాతరైనా మొదటి ఆహ్వానం, మొదటి మర్యాద సర్పంచ్‌కే దక్కుతాయి. రచ్చబండ దగ్గర వేసే ప్రత్యేక కుర్చీ ఆ వ్యక్తికి ఊరిలో ఉన్న స్థానాన్ని చాటిచెబుతుంది. జిల్లా కలెక్టర్ నుంచి స్థానిక తహశీల్దార్, ఎంపీడీవో, ఎస్సై ఇలా ఏ అధికారి అయినా గ్రామానికి వస్తే ముందుగా సర్పంచ్‌తోనే చర్చిస్తారు. ఊరి తరఫున ప్రభుత్వంతో మాట్లాడే అధికారిక ప్రతినిధి సర్పంచ్ మాత్రమే. ఒకసారి సర్పంచ్‌గా గెలిస్తే, పదవీకాలం ముగిసినా జీవితాంతం "మాజీ సర్పంచ్ గారు" లేదా "ప్రెసిడెంట్ గారు" అనే పిలుపు వెన్నంటే ఉంటుంది. తరతరాలకు చెప్పుకునే ఒక శాశ్వత గుర్తింపు ఈ పదవి ద్వారా లభిస్తుంది. అందుకే గ్రామస్థాయి నేతలు తమ జీవిత కాలంలో ఒక్కసారి అయినా ఆ పదవిని అనుభవించాలని తాపత్రయపడతారు.

పదవితో వచ్చే మానసిక ఆనందం

అధికారం కంటే కూడా, ఒకరి కష్టాన్ని తీర్చగలిగే శక్తి మన చేతిలో ఉందనే భావన మనిషికి అత్యున్నతమైన మానసిక ఆనందాన్ని ఇస్తుంది. వీధిలో లైటు వెలగకపోయినా, నీటి కుళాయి రాకపోయినా, ఒక నిరుపేదకు పెన్షన్ ఆగిపోయినా.. సర్పంచ్ ఒక్క ఫోన్ కాల్ లేదా ఒక్క సంతకంతో ఆ పనిని పూర్తి చేయగలరు. మన వల్ల ఒక కుటుంబానికి మేలు జరిగినప్పుడు, ఆ పేదవాడి కళ్లలో కనిపించే ఆనందం, వారు పెట్టే దీవెనలు ఏ కోట్లు పెట్టినా కొనలేనివి. "మా ప్రెసిడెంట్ గారు లేకపోతే ఈ పని అయ్యేది కాదు" అనే ఒక్క మాట ఇచ్చే సంతృప్తి వర్ణనాతీతం.

గ్రామంపై తిరుగులేని అధిపత్యం

సర్పంచ్ అంటే గ్రామానికి ప్రథమ పౌరుడు. ఊరి రూపురేఖలను మార్చే శక్తి ఆ స్థానానికి ఉంటుంది. ఊరిలో సిమెంట్ రోడ్లు వేయాలన్నా, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలన్నా, పాఠశాలను తీర్చిదిద్దాలన్నా సర్పంచ్ చొరవ అత్యంత కీలకం. పదేళ్ల తర్వాత కూడా ఆ రోడ్డు మీద నడిచే ప్రతి ఒక్కరూ "ఇది ఫలానా సర్పంచ్ హయాంలో వేసింది" అని గుర్తుచేసుకుంటారు. పల్లెల్లో చిన్నచిన్న తగాదాలు, కుటుంబ కలహాలు పోలీస్ స్టేషన్ గడప తొక్కకుండా రచ్చబండ దగ్గరే పరిష్కారమవుతాయి. ఇరువర్గాలను ఒప్పించి, న్యాయం చెప్పే 'గ్రామపెద్ద' హోదా సర్పంచ్‌కు సమాజంలో తిరుగులేని పట్టును ఇస్తుంది.

సర్పంచ్ పదవిలో అసలైన కిక్

ఎన్నికల సమయంలో నిద్రాహారాలు మాని గెలవాలని పట్టుబట్టడానికి వెనుక కొన్ని బలమైన మానసిక కారణాలు ఉన్నాయని అంటున్నారు. పల్లె రాజకీయాల్లో గెలుపు అనేది వ్యక్తిగత ప్రతిష్టకు, కుల, వర్గ బలానికి నిదర్శనంగా మారింది. ప్రత్యర్థిపై గెలిచి, ఊరి జనం తనవైపు ఉన్నారని నిరూపించుకోవడంలో ఉండే కిక్ నాయకులకు ఒక వ్యసనం లాంటిదని మానసిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఎమ్మెల్యే, మంత్రి స్థాయికి ఎదిగిన ఎందరో మహామహులు తమ రాజకీయ ప్రస్థానాన్ని సర్పంచ్‌గానే ప్రారంభించినట్లు చరిత్ర చెబుతుంది. ఉన్నత రాజకీయాలకు సర్పంచ్ పదవి ఒక బలమైన పునాది. వందల మంది తన వెనుక నడుస్తుంటే, తన మాట కోసం ఊరంతా ఎదురుచూస్తుంటే కలిగే ఆ 'నాయకత్వపు అనుభూతి' మనిషిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది.

2019 లెక్కలు వేరు.. 2024 తర్వాత పరిస్థితి వేరు : జగన్ కేసుల్లో ఈడీ దూకుడుకు కారణమిదేనా?



దాల్మియా సిమెంట్స్ వ్యవహారంలో వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి ఈడీ నవంబర్ 18న సవరించిన చార్జిషీట్ దాఖలు చేసింది. గతంలో జప్తు చేసిన రూ.793.34 కోట్ల ఆస్తుల విలువను అప్పిలేట్ ట్రైబ్యునల్ రూ.92.52 కోట్లకు తగ్గించిన నేపథ్యంలో ఈడీ తాజా సవరణలు చేసినట్లు సమాచారం. ఈ పరిణామం ఏపీ రాజకీయాల్లో చర్చకు దారితీసింది. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఒక్కసారిగా వేగం పెంచింది. పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, దాల్మియా సిమెంట్స్ వ్యవహారంలో ఇవాళ (నవంబర్ 18) కోర్టులో సవరించిన కొత్త చార్జిషీటును ఈడీ దాఖలు చేసింది. ఈ పరిణామం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మాజీ సీఎం జగన్మోహనరెడ్డిపై ఇప్పటివరకు 9 చార్జిషీట్లు దాఖలు కాగా, తాజాగా పదో అస్త్రం సంధించినట్లుగా భావిస్తున్నారు. అంతేకాకుండా మాజీ సీఎం చుట్టూ ఉచ్చు బిగుస్తోందా అన్న చర్చ జోరందుకుంది. తాజా చర్యను కేవలం న్యాయపరమైన ప్రక్రియగానే కాకుండా, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి, జగన్‌కు మధ్య సంబంధాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

ఇదీ అసలు కథ

దాల్మియా సిమెంట్స్ కేసులో ఈడీ తాజా కదలిక వెనుక బలమైన న్యాయపరమైన కారణాలు ఉన్నాయని న్యాయవాదులు చెబుతున్నారు. సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ కేసులను రోజువారీ విచారణకు అనుమతించడంతో, డిశ్చార్జ్ పిటిషన్లపై త్వరగా తేల్చేందుకు దర్యాప్తు సంస్థ సిద్ధమైందని అంటున్నారు. గతంలో ఈ కేసులో మనీలాండరింగ్ కింద ఈడీ రూ. 793.34 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. అయితే, ఈ ఏడాది మార్చిలో అప్పిలేట్ ట్రైబ్యునల్ నేరారోపణ మొత్తాన్ని రూ. 92.52 కోట్లకు తగ్గించింది. అదే సమయంలో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు బదులు బ్యాంకు గ్యారెంటీ వంటి ప్రత్యామ్నాయ భద్రత కల్పించే వెసులుబాటు ఇచ్చిందని చెబుతున్నారు. ట్రైబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా పాత ప్రాసిక్యూషన్ ఫిర్యాదుకు కీలక సవరణలు చేస్తూ ఈడీ తాజా చార్జిషీటు వేసినట్లుగా భావిస్తున్నారు.

ఢిల్లీ సమీకరణాలు మారుతున్నాయా?

మాజీ సీఎం జగన్ కేసుల్లో ఈడీ దూకుడు వెనుక రాజకీయ కోణం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కేంద్రంతో జగన్ సత్సంబంధాలు నెరిపారనే విమర్శలు ఉండేవి. అప్పట్లో రాజ్యసభలో కీలక బిల్లుల ఆమోదం కోసం బీజేపీకి వైసీపీ మద్దతు అవసరమయ్యేది. కానీ, 2024 ఎన్నికల ఫలితాలు ఆ లెక్కలను తలకిందులు చేశాయి. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి చంద్రబాబు కీలక భాగస్వామిగా మారడంతో ఢిల్లీ ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయాయని విశ్లేషిస్తున్నారు. అసెంబ్లీలో 11 సీట్లకే పరిమితమై, పార్లమెంటులో బలం కోల్పోయిన వైసీపీ అవసరం ఇప్పుడు కేంద్రానికి లేకుండా పోయిందని, ఫలితంగానే జగన్ కేసులపై దృష్టి పెట్టిందనే అభిప్రాయం వినిపిస్తోంది.

ఒత్తిడిలో వైసీపీ అధినేత?

అక్రమాస్తుల కేసు మాత్రమే కాకుండా, గత వైసీపీ హయాంలో జరిగినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం స్కాంతోపాటు పలు కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ అధికారులతో ప్రత్యేక దర్యాప్తులు జరిపిస్తోంది. ఈ కేసులపైనా ఈడీ కన్నేసినట్లు జరుగుతున్న ప్రచారం రాజకీయాలను వేడెక్కిస్తోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ విచారణ సంస్థలు, మరోవైపు కేంద్ర దర్యాప్తు సంస్థల వరుస దాడులతో మాజీ సీఎం జగన్ న్యాయపరంగా, రాజకీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని భావిస్తున్నారు. ఈ పరిణామాల ప్రభావంతోనే జగన్ తన రాజకీయ వ్యూహంలో మార్పులు చేసుకుంటున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన ఇస్తున్న సంకేతాలు కూడా తాజా చిక్కుల తీవ్రతకు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

రోశయ్యకు చెక్

గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపల్ ఎన్నికల వేళ తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలకు జనసేన హైకమాండ్ గట్టిగా బ్రేకులు వేసింది. వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరిన పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పొన్నూరులో జనసేన పార్టీ నేతల్ని రెచ్చగొట్టి పొత్తును విచ్ఛిన్నం చేయాలని చూశారు. ఇటీవల గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వ్యవహారాల్లో జోక్యం చేసుకుని, 35 శాతం సీట్లు కావాలని పట్టుబడుతూ ఫ్రెండ్లీ ఫైట్ పేరుతో అదనపు అభ్యర్థులను బరిలోకి దింపారు. అదే తరహా రాజకీయాన్ని పొన్నూరు మున్సిపల్ ఎన్నికల్లోనూ అమలు చేస్తూ, 30 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేయడంతో కూటమి శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.పొన్నూరు నియోజకవర్గ సీట్ల సర్దుబాటు వ్యవహారాల్లో అనవసరంగా తలదూర్చవద్దని పార్టీ పెద్దలు ముందుగానే సూచించినప్పటికీ, కిలారి రోశయ్య స్థానిక టీడీపీ నేతల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ బహిరంగ వ్యాఖ్యలు చేయడం జనసేన అధిష్టానానికి ఆగ్రహం తెప్పించింది. కూటమి ఐక్యతకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న ఆయన తీరుపై సీరియస్ అయిన జనసేన హైకమాండ్, పొన్నూరు వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని గట్టి వార్నింగ్ ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధిష్టానం నుంచి వచ్చిన స్పష్టమైన హెచ్చరికలతో కిలారి రోశయ్య ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు.పార్టీ అగ్రనాయకత్వం సకాలంలో జోక్యం చేసుకుని రోశయ్య దూకుడుకు కళ్లెం వేయడంతో, పొన్నూరు మున్సిపాలిటీలో టీడీపీ, జనసేన నేతల మధ్య సీట్ల సర్దుబాటు ప్రక్రియ అత్యంత సాఫీగా పూర్తయింది. క్షేత్రస్థాయి బలాబలాలను బట్టి ఇరు పార్టీల స్థానిక నాయకులు పరస్పర అవగాహనతో అభ్యర్థుల జాబితాను ఖరారు చేసుకున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయి, కూటమి కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నేతలు తమ వ్యక్తిగత ఆధిపత్యం కోసం కూటమి ధర్మాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే సహించేది లేదన్న బలమైన సంకేతాన్ని జనసేన అధిష్టానం ఈ ఘటన ద్వారా పంపింది. గుంటూరు జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పాలనుకున్న మాజీ వైసీపీ నేతకు సొంత పార్టీ నుంచే గట్టి షాక్ తగలడంతో, ఇకపై పొన్నూరు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసే వాతావరణం ఏర్పడింది.

ఎన్టీఆర్ విగ్రహానికి అయ్యే ఖర్చుతో మెడికల్ కాలేజీలు కట్టొచ్చు

కదా.. ప్రభుత్వానికి పేర్ని నాని సూటి ప్రశ్న



ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వచ్చే నెలలో టెండర్లు పిలవాలని ప్రభుత్వం భావిస్తోందని వైసీపీ ఆరోపించింది. విజయవాడలో ప్రజాసంఘాల నేతలతో సమావేశమైన మాజీ మంత్రి పేర్ని నాని, ఈ నిర్ణయాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం కోసం రూ.1,500 కోట్లు ఖర్చు చేసే బదులు రెండు మెడికల్ కాలేజీలను పూర్తి చేయొచ్చని ప్రశ్నించారు. ప్రజాసంఘాలతో కలిసి పోరాడతామని ప్రకటించారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశాన్ని విపక్షం వైసీపీ మరోసారి తెరపైకి తెచ్చింది. వచ్చేనెలలో ప్రైవేటీకరణకు ప్రభుత్వం టెండర్లు పిలవనుందని ఆరోపణలు చేస్తోంది. ఈ విషయమై విజయవాడ ప్రెస్ క్లబ్ లో ప్రజాసంఘాల నేతలతో కలిసి వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన నాని రాజధాని అమరావతిలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం రూ.1500 కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఆ డబ్బుతో రెండు మెడికల్ కాలేజీలను అయినా పూర్తి చేయొచ్చు కదా? అంటూ ప్రశ్నించారు.మెడికల్ కాలేజీల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం ద్వారా ప్రైవేటీకరణను ముందుకు తీసుకువెళ్లకుండా అడ్డుకోవాలని వైసీపీ భావిస్తోందని చెబుతున్నారు. గత ఏడాది ఈ అంశంపై ఉధృత పోరాటం చేసిన వైసీపీ అనుకున్న ఫలితం సాధించిందని అంటున్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మించాలని భావించిన ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే అప్పట్లో ఎవరు టెండర్లు వేయొద్దని, తన మాట కాదని ఎవరైనా టెండర్లు వేస్తే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేస్తామని మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి హెచ్చరించారు. దీంతో అప్పట్లో ఏ ఒక్కరూ మెడికల్ కాలేజీల నిర్మాణానికి ముందుకు రాలేదని అంటున్నారు.ఇక ఈ విషయంలో అసలు వెనక్కి తగ్గకూడదని నిర్ణయం తీసుకున్న వైసీపీ తాజాగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం మళ్లీ ప్రయత్నాలు మొదలు పెట్టిందని చెబుతూ, పోరాటానికి సిద్ధమనే సంకేతాలు పంపింది. విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఈ విషయమై మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి పేర్ని నాని ప్రభుత్వంపైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ పై ఘాటు విమర్శలు గుప్పించారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ కు ఏమైనా అనారోగ్యం అనిపిస్తే హైదరాబాద్ వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారని ఆరోపించారు. పవన్ భుజం శస్త్రచికిత్సకు ముంబై వెళ్లిన విషయాన్ని ఎత్తిచూపారు.రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో సరైన వైద్యం అందడం లేదని పేర్ని ఆరోపించారు. అందుకే ప్రభుత్వంలో ఉన్న వారు పక్క రాష్ట్రాలకు వెళుతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు ప్రతి నెల పింఛన్లు పంపిణీకి ఏదో ఒక జిల్లాకు వెళుతున్నారని, ఈ పర్యటన కోసం రూ.2 కోట్లు వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. గత రెండున్నరేళ్లలో ఈ డబ్బు జాగ్రత్త చేసిన రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయ్యేదని మాజీ మంత్రి పేర్ని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ఆలోచన మార్చుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వైసీపీ అంగీకరించదని తేల్చిచెప్పారు. ఈ విషయంలో ప్రజాసంఘాలతో కలిసి పోరాడతామన్నారు. తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు ఉన్నా, మెడికల్ కాలేజీల విషయంలో అంతా ఓకే మాటపై నిలుస్తామని తేల్చిచెప్పారు.

నేడు తీవ్ర తుఫానుగా మారనున్న అక్వాన్

విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ తుపాను, నేటి(బుధవారం) ఉదయానికి తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. గురువారానికి ఇది అతి తీవ్ర తుపానుగా బలపడి, నవంబర్ 20వ తేదీ మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్-యానాం తీర ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మంగళవారం నాటి సమాచారం ప్రకారం, ఈ తుపాను చెన్నైకి 590 కి.మీ., మచిలీపట్నానికి 670 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది గంటకు 3 కిలోమీటర్ల వేగంతో నెమ్మదిగా వాయవ్య దిశగా కదులుతోంది. తీరం దాటే సమయంలో గంటకు 120-130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకవచ్చని అధికారులు తెలిపారు. నెల్లూరు నుంచి తుని లేదా విశాఖపట్నం సమీప ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉంది.

తుపాను ప్రభావంతో బుధవారం నుంచి కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, నవంబర్ 19, 20 తేదీల్లో కొన్ని చోట్ల 21 సెం.మీ.కి పైగా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం వంటి ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడవచ్చు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే పలు పోర్టుల్లో ప్రమాద హెచ్చరిక సంకేతాలను ఎగురవేశారు. నెల రోజుల వ్యవధిలో రాష్ట్ర తీరాన్ని తాకనున్న మూడో తుపాను కావడంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఈ తుపాను ప్రభావం ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలపై కూడా ఉంటుందని జాతీయ వార్తా సంస్థల కథనాలు పేర్కొన్నాయి. నవంబర్ 20, 21 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు, మధ్యప్రదేశ్‌లోని 9 జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.

పట్టణాలపై పెరుగుతోన్న నీటి భారం

అమరావతి : సంస్కరణల ప్రభావంతో పట్టణ ప్రాంతాల్లో నీటి ఛార్జీల భారం క్రమంగా పెరుగుతోంది. వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేస్తే ఈ భారం మోయలేని విధంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే వాణిజ్య, గ్రూపు హౌసింగ్ కుళాయిలకు మీటర్లు పెడుతున్న ప్రభుత్వం నెమ్మదిగా అన్ని ఇళ్లకూ పెట్టనుంది. అమృత్ పథకం సంస్కరణలతోపాటు, అంతకుముందు అమలు చేసిన జెఎన్ఎన్‌యుఆర్ఎం పథకం సంస్కరణలు కూడా ప్రజలపై భారం వేస్తున్నాయి. వాస్తవంగా యుపిఎ ప్రభుత్వ హయాంలో ఉన్న ఎన్‌యుఆర్ఎం పథకాన్నే అనంతరం అమృత్‌గా మార్చారు. పట్టణ స్థానిక సంస్థలు బలోపేతం కావాలంటూ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకాన్ని తీసుకొచ్చి కచ్చితంగా అప్పు చేయాల్సిందేననే నిబంధన పెట్టారు. ఈ రూపాల్లో తీసుకునే అప్పును తీర్చాలంటే 100 శాతం కాస్ట్ రికవరీ కింద ఖర్చు మొత్తాన్ని ప్రజల నుండే వసూలు చేయనున్నారు. ప్రస్తుతం వసూలు చేస్తున్న నీటి ఛార్జీలు సరిపోవడం లేదని, వీటిని ఇంకా పెంచాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో నీటి ఛార్జీల డిమాండు పాత బకాయిలతో కలిపితే సుమారు రూ.800 కోట్ల వరకూ ఉంది. ఆస్తిపన్నుతో పోలిస్తే నవంబరు నెల వరకూ రూ.510.23 కోట్ల వసూలు చేయాల్సి ఉంది. దీనిలో రూ.122.83 కోట్లు వసూలు చేశారు. గతేడాది ఇదే సమయానికి రూ.126.39 కోట్లు వసూలైంది. వాస్తవంగా ఇది చాలదని, మరింత పెంచాల్సి ఉంటుందని ప్రతిపాదించినట్లు తెలిసింది. దీనిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని నగరాల్లో అన్ని కనెక్షన్లకు నీటి మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు నీటి ఛార్జీలే కాకుండా కనెక్షన్ ఛార్జీలు కూడా పెద్దయెత్తున వసూలు చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు కనీసం రూ.8 వేల నుంచి రూ.30 వేల వరకూ వసూలు చేస్తుండగా, పరిశ్రమలకు వాటర్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.54 వేల వరకూ వసూలు చేస్తున్నారు. నీటి అవసరాలు పైపులైను సామర్థ్యం ఆధారంగా ఈ ఛార్జీలు ఉండనున్నాయి. అయితే రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటైతే కచ్చితంగా ప్రతి కనెక్షన్‌కూ నీటి మీటరు బిగించాల్సి ఉంటుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విజయవాడ వంటి నగరాల్లో ఇప్పటికే మీటర్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఆదీ ఫావీ-జీఫో) పథకంలో ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన చికిత్సల పరిధిని భారీగా విస్తరించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం 23గా ఉన్న ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీల సంఖ్యను ఏకంగా 112కు పెంచాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని రకాల వైద్య, శస్త్రచికిత్స సేవలు అందుబాటులోకి రానున్నాయి.

23 నుంచి 112కు ప్యాకేజీలు

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత వైద్య చికిత్స అందించడమే కేంద్రం లక్ష్యం. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన 23 ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీలను 112కు పెంచే ప్రతిపాదనను నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) సిద్ధం చేసింది. ఇందులో కొత్తగా 89 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను చేర్చాలని గుర్తించింది. సాధారణ అనారోగ్య సమస్యల నుంచి కొన్ని కీలక శస్త్రచికిత్సల వరకు విస్తృత సేవలను ప్రభుత్వ వైద్య సంస్థల ద్వారా అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

సాధారణ వ్యాధులకు సమీపంలోనే చికిత్స

ప్రస్తుతం చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా చాలామంది రోగులు దూర ప్రాంతాల్లోని పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చడమే ప్రతిపాదన ప్రధాన ఉద్దేశం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్ డివిజనల్ ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను ఉపయోగించుకుని మరిన్ని చికిత్సలు అందించనున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు లభించే అవకాశం ఉంటుంది.

ఏయే చికిత్సలు అందుబాటులోకి వస్తాయంటే?

ఎన్‌హెచ్ఏ గుర్తించిన ప్రతిపాదిత ప్యాకేజీల్లో పలు సాధారణ శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు ఉన్నాయి. ముఖ్యంగా హిస్టరెక్టమీ (గర్భాశయ తొలగింపు), సున్తీ, బయాప్సీ, హైడ్రోసీల్, హెమరాయిడ్స్, సిస్ట్‌లు, లిపోమాల చికిత్సలను చేర్చాలని ప్రతిపాదించారు. అలాగే కంటి సంబంధిత సమస్యల్లో డయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా స్క్రీనింగ్‌కు అవకాశం కల్పించనున్నారు. రక్తహీనత, అధిక రక్తపోటు, బ్రాంకైటిస్, డయేరియా, రక్తవిరేచనాలు, గ్యాస్ట్రోఎంటరైటిస్, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, రీనల్ కోలిక్, తీవ్రమైన జ్వర సంబంధిత అనారోగ్యాలు, మధుమేహ సంబంధిత కొన్ని సమస్యలకు చికిత్సలు అందించేలా ప్రతిపాదనలు రూపొందించారు.



ప్రభుత్వ ఆస్పత్రులకు అదనపు ఆదాయం ఈ ప్రతిపాదన వల్ల రోగులకే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ఆయుష్మాన్ భారత్ కింద అర్హులైన రోగులకు నగదు రహిత చికిత్స అందించినందుకు ప్రభుత్వ ఆస్పత్రులకు రీయింబర్స్‌మెంట్ రూపంలో నిధులు అందుతాయి. ఈ మొత్తాన్ని ఆస్పత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు, మందులు, ఇతర వైద్య వినియోగ వస్తువుల సమకూర్పునకు వినియోగించుకోవచ్చు. అంతేకాకుండా అదనపు వైద్య సిబ్బంది నియామకం, ఆస్పత్రుల నిర్వహణ ఖర్చులకు కూడా ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

రాష్ట్రాల అభిప్రాయాల సేకరణ

ప్రతిపాదిత మార్పులపై రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించేందుకు నేషనల్ హెల్త్ అథారిటీ 2026 అక్టోబర్ 13న మెమోరాండం జారీ చేసినట్లు సమాచారం. కొత్త ప్యాకేజీల జాబితాను పరిశీలించి, తమ సూచనలు, అభిప్రాయాలను నవంబర్ 25లోపు సమర్పించాలని రాష్ట్ర ఆరోగ్య ఏజెన్సీలను కోరింది. రాష్ట్రాల నుంచి అందే సూచనలను పరిశీలించిన అనంతరం తుది విధానాన్ని ఖరారు చేయనున్నారు.

డిసెంబర్ 1 నుంచి అమలయ్యే అవకాశం

రాష్ట్రాల అభిప్రాయాలు, సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత సవరించిన విధానాన్ని 2026 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి తీసుకురావచ్చని ఎన్‌హెచ్ఏ వర్గాలు వెల్లడిం చినట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది ఆధారంగా ప్యాకేజీల అమలును నిర్ణయించనున్నారు. అవసరమైతే ముందస్తు అనుమతితో రాష్ట్రాలు తమ పరిధిలోని రిజర్వ్ ప్యాకేజీల సంఖ్యను తగ్గించుకునే వెసులుబాటు కూడా కల్పించనున్నారు.

గ్రామీణ పేదలకు మరింత మేలు

ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. చిన్నచిన్న చికిత్సల కోసం జిల్లా కేంద్రాలు, నగరాల్లోని పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా అవుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల వినియోగం పెరగడంతో వాటి సామర్థ్యం, సేవల నాణ్యత కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది.

ఆయుష్మాన్ భారత్ పథకంలో ప్రతిపాదించిన ఈ విస్తరణ అమల్లోకి వస్తే ప్రభుత్వ వైద్య రంగానికి కొత్త ఊతం లభించనుంది. అయితే 112 ప్యాకేజీల పెంపు ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉందని, తుది మార్గదర్శకాలు విడుదలైన తర్వాతే ఏయే చికిత్సలు ఎక్కడ అందుబాటులోకి వస్తాయో స్పష్టత రానుంది.

మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సామాన్యుడి జీవనం భారంగా మారిందని, ధరల పెరుగుదలతో ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయని విమర్శించారు. 2014లో ధరలను నియంత్రిస్తామని ఇచ్చిన హామీలకు, ప్రస్తుత పరిస్థితులకు పొంతన లేదని వ్యాఖ్యానిం చారు. ఆర్థిక నిర్వహణలో లోపాల భారాన్ని సామాన్య ప్రజలు ఇంకెంతకాలం భరించాలని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

కనీస అవసరాలకూ కష్టమే

ప్రధాని మోదీ పాలనలో సామాన్యులు కనీస అవసరాలు తీర్చుకోవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారని ఖర్గే ఆరోపించారు. 2014లో ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, 2026 నాటికి నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగే పరిస్థితిని తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందని, కుటుంబ బడ్జెట్లు తలకిందులవుతున్నాయని పేర్కొన్నారు. గోధుమ పిండి ధర కిలో రూ.21 నుంచి రూ.69కు, కందిపప్పు ధర రూ.75 నుంచి రూ.180కు, ఆవనూనె ధర రూ.102 నుంచి రూ.263కు పెరిగిందని ఖర్గే వెల్లడించారు. అలాగే లీటర్ పాల ధర రూ.36 నుంచి రూ.85కు, కిలో బియ్యం ధర రూ.29 నుంచి రూ.71కు చేరిందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు.

దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు



అక్టోబర్ నెలలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 8.94 శాతానికి, టోకు ధరల ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరినట్లు ఖర్గే ప్రస్తావించారు. గతేడాదితో పోలిస్తే 61 శాతం కుటుంబాల్లో నిత్యావసర వస్తువులపై నెలవారీ ఖర్చు 20 శాతానికి పైగా పెరిగిందని తెలిపారు. మరోవైపు 74 శాతం మంది ప్రజలు అత్యవసరం కాని ఖర్చులను తగ్గించుకుం టున్నారని పేర్కొన్నారు. దేశ పురోగతిని ప్రధాని మోదీ ప్రసంగాల నిడివితో కొలవలేమని, సామాన్యుడి కంచంలో ఉన్న ఆహారం, ఖర్చుల తర్వాత జేబులో మిగిలే ఆదాయమే నిజమైన అభివృద్ధికి కొలమానమని ఖర్గే వ్యాఖ్యానించారు.

ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సైతం ధరల పెరుగుదల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశించిన 6 శాతం గరిష్ఠ పరిమితిని దాటి 6.09 శాతానికి చేరిందని ఆరోపించారు. అక్టోబర్‌లో టోకు ధరల ద్రవ్యోల్బణం కూడా 12.29 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో కుటుంబాల ఆహార బడ్జెట్‌పై అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారీగా పెరిగిన టోకు ధరల ద్రవ్యోల్బణం

అక్టోబర్ నెలలో దేశ టోకు ధరల ద్రవ్యోల్బణం 12.29 శాతానికి పెరిగినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధానంగా ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల దీనికి కారణమని పేర్కొంది. సెప్టెంబర్‌లో 25.85 శాతంగా ఉన్న ఇంధనం, విద్యుత్ విభాగం ద్రవ్యోల్బ ణం అక్టోబర్‌లో 32.84 శాతానికి చేరినట్లు తెలిపింది. ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం 8.67 శాతం నుంచి 9.24 శాతానికి పెరిగింది. అయితే తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మాత్రం 9.76 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 9.54 శాతానికి పరిమితమైంది.

ఇంధనం, ఆహార పదార్థాల ధరల ప్రభావం

టోకు ధరల ద్రవ్యోల్బణం పెరుగుదలకు మినరల్ ఆయిల్స్, ముడి పెట్రోలియం, సహజ వాయువు, విద్యుత్, ఆహార పదా ర్థాలు, ప్రాథమిక లోహాలు, రసాయనాలు, ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదల ప్రధాన కారణాలుగా మంత్రిత్వ శాఖ పేర్కొంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ద్రవ్యోల్బణ గణాం కాలు తాత్కాలికమైనవని, 81.1 శాతం వెయిటెడ్ రెస్పాన్స్ రేటు ఆధారంగా వీటిని రూపొందించినట్లు వివరించింది.

భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

టోక్యో: మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు భారత్, జపాన్ దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు సరికొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు పెరుగుతున్న నేపథ్యంలో విశ్వసనీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. భారత్, జపాన్ పరస్పర సహకారాన్ని విస్తరించుకోవడానికి ఇదే సరైన సమయమని స్పష్టం చేశారు. జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించిన 'రైసినా టోక్యో--2026' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

ప్రపంచ వ్యవస్థలో ఐదు కీలక మార్పులు

ప్రస్తుత ప్రపంచ వ్యవస్థను ప్రభావితం చేస్తున్న ఐదు ప్రధాన పరిణామాలను జైశంకర్ వివరించారు. అంతర్జాతీయ వ్యవస్థకు వరుసగా ఎదురవుతున్న సంక్షోభాలు, వనరులు--సాంకేతికతను వ్యూహాత్మక ఆయుధాలుగా ఉపయోగించడం, దేశాల మధ్య పెరుగుతున్న పోటీతత్వం, ఆర్థిక నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు, విశ్వసనీయ భాగస్వామ్యాల ప్రాధాన్యం పెరగడం వంటివి ఇందులో ఉన్నాయని తెలిపారు. కొవిడ్ మహమ్మారి, ప్రధాన యుద్ధాలు, వాణిజ్య అంతరాయాలు, ఆర్థిక అస్థిరత వంటి పరిణామాలు ప్రపంచ వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. గతంలో ప్రపంచీకరణ ద్వారా ఏర్పడిన సరఫరా వ్యవస్థలు ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అభిప్రాయపడ్డారు.

వనరులే వ్యూహాత్మక ఆయుధాలు

ఇంధనం, సహజ వనరులు, మార్కెట్ ప్రాప్యత, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వ్యవస్థలను దేశాలు వ్యూహాత్మక సాధనాలు గా ఉపయోగిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీ య పోటీ కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాకుండా అనేక రంగాలకు విస్తరిస్తోందన్నారు. దేశాలు తమ ఆధిపత్యాన్ని



పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని వివరించారు.

విశ్వసనీయ భాగస్వామ్యాలకే ప్రాధాన్యం

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దేశాలు, వ్యాపార సంస్థలు తమ సరఫరా వ్యవస్థల్లో మార్పులు చేసుకుంటున్నాయని జైశంకర్ తెలిపారు. గతంలో తక్కువ ఖర్చు, అధిక సామర్థ్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారని, ప్రస్తుతం విశ్వసనీయత, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు, భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నిబంధనలను స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించే ధోరణులను ఎదుర్కొంటూ, నిబంధనలను నిజాయితీగా పాటించే దేశాలకు నష్టం జరగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

భారత అభివృద్ధిని గుర్తించాలి

2014 నుంచి భారత్‌లో చోటుచేసుకున్న ఆర్థిక, సాంకేతిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిని జపాన్ గుర్తించాలని జైశంకర్ సూచించారు. భారతదేశంలో విస్తరిస్తున్న దేశీయ మార్కెట్, మెరుగుపడుతున్న మౌలిక సదుపాయాలు జపాన్ కంపెనీలకు మంచి అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. తయారీ, ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే జపాన్ సంస్థలకు భారత్ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందని వివరించారు.

పలు రంగాల్లో విస్తృత సహకారానికి అవకాశం

విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్షం, డ్రోన్లు, ఆరోగ్య సంరక్షణ, రక్షణ రంగాల్లో భారత్ గణనీయమైన పురోగతి సాధిస్తోందని జైశంకర్ వివరించారు. ఈ రంగాల్లో జపాన్‌తో కలిసి పనిచేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా తయారీ, సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలు, సమాచార సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, ఔషధ తయారీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.

రక్షణ, భద్రతా రంగాల్లో మరింత బలం

భారత్, జపాన్ మధ్య రక్షణ, భద్రతా సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం సమర్థవంతమైన విధానాలు, సహకార వ్యవస్థలను అభివృద్ధి చేయాలని సూచించారు. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, పరస్పర విశ్వాసం భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు మార్గం సుగమం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి దోహదం

భారత్, జపాన్ మధ్య సుదీర్ఘకాలంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయని జైశంకర్ గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యం కేవలం ఆర్థిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా ఆసియా ప్రాంతంతోపాటు ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరులో భద్రతా బలగాలు కీలక విజయాన్ని సాధించాయి. లష్కరే తయ్యిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ కమాండర్ లతీఫ్ భట్‌ను భద్రతా దళాలు హతమార్చాయి. కశ్మీర్‌లో క్రియాశీలంగా ఉన్న చివరి స్థానిక లష్కరే తయ్యిబా ఉగ్రవాదిగా భావిస్తున్న అతడి కోసం భద్రతా సంస్థలు కొంతకాలంగా గాలిస్తున్నాయి. ఇటీవల కుల్గాం జిల్లాలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై జరిగిన కాల్పుల ఘటనలో అతడి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు అతడి ఆచూకీని గుర్తించి మట్టుబెట్టాయి.

మసీదులో తలదాచుకున్న ఉగ్రవాది

లతీఫ్ భట్ భద్రతా బలగాల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ మసీదులోకి ప్రవేశించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు తొలుత లొంగుబాటుకు అవకాశం కల్పించారు. వీడియో కాల్ ద్వారా సంప్రదించి ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవాలని కోరారు. లొంగిపోతే ఎలాంటి హాని జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే అధికారుల విజ్ఞప్తిని అతడు తిరస్కరించడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగించాయి. చివరకు అతడిని హతమార్చాయి. ఈ ఘటనలో మసీదుకు ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు.

నవంబర్ 16న తప్పించుకుని.. చివరకు హతం

కుల్గాం జిల్లాలోని లారూ ప్రాంతంలో నవంబర్ 16న భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో లతీఫ్ భట్ బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నట్లు సమాచారం. ఇదే ఆపరేషన్‌లో మరో ఉగ్రవాది ఉమర్ నాసిర్ దార్ హతమయ్యాడు. దీంతో లతీఫ్ కోసం భద్రతా బలగాలు గాలింపును మరింత ముమ్మరం చేశాయి. సైన్యం, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చివరకు అతడి కదలికలను గుర్తించి చుట్టుముట్టాయి.

అమిత్ షా ప్రశంసలు

ఈ ఆపరేషన్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్ బలగాలు అత్యున్నత సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించాయని ప్రశంసించారు. దేశ భద్రత కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించిన జవాన్లకు దేశం వందనం చేస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి. సింగ్ కూడా భద్రతా బలగాలను అభినందించారు. ఈ ఆపరేషన్ 2026లో కీలక విజయాల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు..

న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాదికి సుప్రీంకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌బీఏ) దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. సదరు న్యాయవాది వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను 2027 జనవరి 20కు వాయిదా వేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. పిటిషన్‌తో పాటు అటార్నీ జనరల్ ఇచ్చిన సమ్మతిని కూడా పరిశీలించినట్లు తెలిపింది. కోర్టు ధిక్కరణ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) ప్రకారం అటార్నీ జనరల్ అనుమతి లభించిన నేపథ్యంలో.. సంబంధిత న్యాయవాదిపై ధిక్కరణ చర్యలు ప్రారంభించేందుకు ఎస్‌బీఏ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది.

కోర్టు విచారణలోనే వివాదం

సోమవారం సుప్రీంకోర్టులో ఈ ఘటన చోటుచేసుకుంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనలతో కూడిన ధర్మాసనం విచారణకు సమావేశమైన సమయంలో ఓ న్యాయవాది తన వాదనలు అత్యవసరంగా వినాలని కోరారు. న్యాయవ్యవస్థలో అవినీతి జరుగుతోందంటూ తాను చేసిన ఆరోపణలపై కోర్టు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై నవంబర్ 2న సీజేఐ కార్యాలయానికి లేఖ పంపినా సమాధానం రాలేదని పేర్కొంటూ.. వెంటనే విచారణ చేపట్టాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా జస్టిస్ మోహన స్పందిస్తూ.. ఇలాంటి అంశాలను ప్రస్తావించడానికి ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. అయినప్పటికీ న్యాయవాది తన వాదనను కొనసాగించారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'మేము పరిశీలిస్తాం, మీరు వేచి ఉండండి' అని సూచించారు.

సీజేఐ పదవిపై అభ్యంతరకర వ్యాఖ్యలు

అయితే న్యాయవాది వెనక్కి తగ్గకుండా సీజేఐపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'నేను వేచి ఉండను. మీరు ఆ కుర్చీలో కూర్చోవడానికి అర్హులు కాదు. ఆ పదవికి తగిన నిజాయతీ మీకు లేదు' అంటూ వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో కొంతసేపు కోర్టు వర్చువల్ విచారణలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం భద్రతా సిబ్బంది సదరు న్యాయవాదిని కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు.

ధిక్కరణ చర్యలకు బార్ అసోసియేషన్ విజ్ఞప్తి

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్.. సంబంధిత న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ప్రదీప్ రాయ్ ఈ పిటిషన్ తరఫున వాదనలు వినిపించారు. న్యాయస్థానంలో ఈ తరహా ప్రవర్తన పూర్తిగా ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అటార్నీ జనరల్ సమ్మతి నేపథ్యంలో ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

భారత్ వ్యతిరేక ప్రచారానికి రాహుల్‌గాంధీ నాయకత్వం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భారత్ వ్యతిరేక ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారని బీజేపీ నేతలు తీవ్రంగా ఆరోపించారు. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో భారత ఆర్థిక వ్యవస్థపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాలు భారత్‌ను వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తిస్తుంటే, రాహుల్ మాత్రం విదేశీ వేదికలపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని బీజేపీ నేత ఆశిశ్ ఉషా అగర్వాల్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆశిశ్ ఉషా అగర్వాల్ ఎక్స్ వేదికగా విమర్శించారు. భారతదేశ ప్రగతిని దెబ్బతీయడం, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను బలహీనపరచడమే ఆయన ఉద్దేశమని ఆరోపించారు. భారత్ ప్రధాన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతోందని, అయినప్పటికీ రాహుల్ విదేశీ గడ్డపై దేశాన్ని ఆర్థిక సంక్షోభంలో ఉన్నట్లుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) దేశ వృద్ధి రేటుపై సానుకూల అంచనాలు వెల్లడించాయని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి రేటు 7 నుంచి 7.1 శాతం మధ్య ఉండవచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. గోల్డ్‌మన్ శాక్స్ సైతం దేశ జీడీపీ వృద్ధిని 6.9 శాతంగా అంచనా వేసిందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ పరివర్తన రంగాల్లో భారత్ పురోగమిస్తున్న సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు చేయడం ఎందుకని ప్రశ్నించారు.

'భారతదేశపు మీర్ జాఫర్' అంటూ భాటియా విమర్శలు

అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. రాహుల్‌ను 'భారతదేశపు మీర్ జాఫర్'గా అభివర్ణిస్తూ, ఆయన వ్యాఖ్యలు దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు వెళ్లడాన్ని గౌరవ్ భాటియా ప్రస్తావించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు విదేశీ పర్యటనలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. విదేశీ శక్తుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడానికే ఆయన అక్కడికి వెళ్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో జార్జ్ సోరోస్, ఇల్హాన్ ఒమర్ వంటి వారితో రాహుల్ జరిపిన భేటీలను ప్రస్తావిస్తూ, భారత్‌ను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

సంపాదకీయం

తూర్పు దౌత్యం!

ఒకప్పుడు పాశ్చాత్య దేశాల వేదికలపైనే ప్రపంచ రాజకీయాలకు సంబంధించిన ప్రధాన నిర్ణయాలు జరిగేవి. ఇప్పుడు ఆసియా దేశాల ప్రాధాన్యం పెరుగుతుండటంతో అంతర్జాతీయ సమావేశాలు, వ్యూహాత్మక చర్చలకు తూర్పు దేశాలు వేదికలవుతున్నాయి. మనీలాలో ఇటీవల జరిగిన ఆసియాన్, ఆసియాన్-భారత్, ఈస్ట్ ఏషియా, ఆసియాన్-అమెరికా సమావేశాలతోపాటు క్వాడ్ దేశాధినేతల భేటీ ఈ మార్పునకు అద్దం పడుతోంది. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ కూటమి రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ సమావేశమవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక సహకారం, స్వేచ్ఛాయుత నౌకాయానానికి సంబంధించి ఉమ్మడి కార్యాచరణ అవసరాన్ని నాలుగు దేశాలూ గుర్తించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సమావేశానికి హాజరై క్వాడ్ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే ఆకాంక్ష వ్యక్తం చేయడం కూటమికి కొత్త ఉత్సాహాన్నిచ్చింది. క్వాడ్ పునరుజ్జీవనం కేవలం నాలుగు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికే పరిమితం కాదు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, సముద్ర భద్రత, వ్యూహాత్మక సమతుల్యత, ప్రాంతీయ దేశాల స్వేచ్ఛకు భరోసా కల్పించాలనే విస్తృత లక్ష్యాలు ఇందులో అంతర్లీనంగా ఉన్నాయి. అయితే, కూటమి బలోపేతం కావడం అంటే మరో దేశంతో ఘర్షణకు సిద్ధపడటం కాదు. ప్రాంతీయ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, అంతర్జాతీయ చట్టాలకు గౌరవం ఇవ్వడం, దేశాల సార్వభౌమత్వాన్ని పరిరక్షించడం, పరస్పర ప్రయోజనాల కోసం సహకరించుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలి.

భద్రతా సహకారంతోపాటు ఆర్థిక, సాంకేతిక రంగాల్లోనూ క్వాడ్ దేశాలు పరస్పర భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించడం భవిష్యత్ అవసరాలను ప్రతిబింబిస్తోంది. ఇండో-పసిఫిక్ సముద్ర మార్గాల్లో నౌకాయాన భద్రత, జలాంతర్గాముల కదలికలను గుర్తించడం, సముద్రంలో అక్రమ కార్యకలాపాలను నిరోధించడం వంటి అంశాలపై ఉమ్మడి దృష్టి సారించడం వ్యూహాత్మకంగా కీలకం. సముద్ర మార్గాలపై ఆధారపడే దేశాలకు చిన్నపాటి అంతరాయం కూడా భారీ ఆర్థిక నష్టాలను కలిగించగలదు. ముఖ్యంగా చమురు, సహజ వాయువు, పారిశ్రామిక ముడిసరుకుల రవాణాకు సముద్ర మార్గాలే ప్రధాన ఆధారం. హర్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం, బాబ్ ఎల్ మండెబ్ వంటి ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరిగితే ప్రపంచ ఇంధన మార్కెట్లు, రవాణా వ్యయాలు, వాణిజ్య సరఫరా వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ నౌకాయానానికి భద్రత కల్పించడం అన్ని దేశాల ఉమ్మడి బాధ్యత. క్వాడ్ దేశాలు కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, అరుదైన ఖనిజాలపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించడం, ప్రత్యామ్నాయ వనరులను అభివృద్ధి చేయడం వంటి ప్రయత్నాలు కూడా ప్రాధాన్యం పొందుతున్నాయి. వ్యర్థాల నుంచి కీలక ఖనిజాలను వెలికితీసే సదుపాయాల ఏర్పాటుకు అమెరికా 10 మిలియన్ డాలర్ల నిధులను ప్రకటించడం ఈ దిశలో ఒక ముందడుగు. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, రక్షణ రంగ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతిక పరికరాల తయారీకి కీలక ఖనిజాలు అవసరం. వాటి సరఫరాపై కొద్దిమంది దేశాల ఆధిపత్యం ఉండటం ఇతర దేశాలకు ఆర్థిక, వ్యూహాత్మక సమస్యలను సృష్టిస్తోంది. కాబట్టి సరఫరా వ్యవస్థలను విస్తరించడం, ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడం, పరస్పర పెట్టుబడులను ప్రోత్సహించడం క్వాడ్ దేశాలకు ప్రయోజనకరం. కృత్రిమ మేధస్సు, సూపర్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో సహకారం కూడా భవిష్యత్ పోటీలో కీలకంగా మారనుంది. అయితే సాంకేతిక పురోగతి మానవ సంక్షేమానికి ఉపయోగపడేలా, సైబర్ భద్రత, వ్యక్తిగత సమాచార రక్షణ, సాంకేతిక దుర్వినియోగాన్ని నిరోధించే చర్యలతో ముందుకు సాగాలి.

మనీలాలో జరిగిన సమావేశాలు భారత్‌కు అంతర్జాతీయ దౌత్యంలో తన ప్రాధాన్యాన్ని చాటుకునేందుకు మంచి అవకాశాన్ని కల్పించాయి. ఆసియాన్ దేశాలతో భారత్‌కు భౌగోళిక, చారిత్రక, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి. ఈ సంబంధాలను మరింత బలోపేతం చేయడం ద్వారా తూర్పు ఆసియా మార్కెట్లలో భారత ఉత్పత్తులకు అవకాశాలు పెరుగుతాయి. రవాణా అనుసంధానం, సముద్ర వాణిజ్యం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, రక్షణ, పర్యాటకం, పెట్టుబడుల రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవచ్చు. ఆసియాన్ దేశాలు కూడా భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా చూస్తున్న నేపథ్యంలో, ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ శాంతి, స్థిరత్వం, సహకారానికి ఇచ్చిన ప్రాధాన్యం ప్రస్తుత పరిస్థితుల్లో సముచితమైనది. యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు, ఇంధన సంక్షోభాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏ ఒక్క దేశానికీ పరిమితమైన సమస్యలు కావు. వీటి ప్రభావం అభివృద్ధి చెందుతున్న దేశాలపై మరింత తీవ్రంగా పడుతుంది. అందువల్ల అంతర్జాతీయ సంస్థలు, ప్రాంతీయ కూటములు సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా వ్యవహరించాలి. క్వాడ్‌లో భారత్ భాగస్వామిగా ఉన్నప్పటికీ రష్యాతో రక్షణ, ఇంధన సంబంధాలు, చైనాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించాల్సిన అవసరం ఉంది. అమెరికా, చైనా మధ్య పోటీ తీవ్రతరం అవుతున్న సమయంలో భారత్ ఏ ఒక్క శక్తి కేంద్రానికి పూర్తిగా అనుకూలంగా వ్యవహరించకుండా తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగించాలి. మనీలాలో జరిగిన సమావేశాల అనంతరం షెన్‌జెన్‌లో జరగనున్న అంతర్జాతీయ చర్చలు, అమెరికా-చైనా-రష్యా దేశాల మధ్య ప్రతిపాదిత త్రైపాక్షిక సమావేశం ప్రపంచ రాజకీయాల్లో కొత్త పరిణామాలకు దారితీయవచ్చు. బహుళ ధ్రువ ప్రపంచంలో దేశాల మధ్య సహకారం, చర్చలు, పరస్పర గౌరవం మరింత అవసరమవుతున్నాయి. భారత్ తన 'యాక్ట్ ఈస్ట్' విధానాన్ని కార్యాచరణలోకి తీసుకువస్తూ ఆసియాన్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయాలి. అంతర్జాతీయ వేదికలపై అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలను ప్రస్తావిస్తూ, శాంతి, స్థిరత్వం, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇచ్చే దేశంగా తన పాత్రను విస్తరించుకోవాలి. అగ్రరాజ్యాల పోటీ మధ్య సమతుల్యత పాటిస్తూ, సహకారానికి వారధిగా నిలవగలిగితే ప్రపంచ వ్యవస్థలో భారత్ ప్రభావం మరింత పెరుగుతుంది.

పనికొచ్చే పలుకు



అవే.. నిజమైన సంతోషాలు!

డబ్బు సంపాదించడం ఒక కళ అయితే, దాన్ని సరైన పద్ధతిలో ఉపయోగించడం అంతకంటే గొప్ప కళ. చాలామంది జీవితమంతా సంపాదన వెనుక పరుగులు తీస్తుంటారు. కొందరు సంపాదించిన ప్రతి రూపాయినీ ఖర్చు చేయడానికి వెనుకాడరు. మరికొందరు భవిష్యత్తు భద్రత పేరుతో డబ్బును కూడబెట్టడమే జీవిత లక్ష్యంగా భావిస్తారు. కానీ నిజమైన ఆర్థిక క్రమశిక్షణ అంటే ఈ మూడింటి మధ్య సమతుల్యత. దాచుకునే డబ్బు మనకు భవిష్యత్తుపై భరోసానిస్తుంది. పెట్టుబడిగా పెట్టే డబ్బు ఆర్థిక స్వేచ్ఛకు మార్గం చూపుతుంది. అవసరాలకు, ఆనందాలకు ఖర్చు చేసే డబ్బు జీవితానికి మధురమైన జ్ఞాపకాలను అందిస్తుంది. ఈ మూడింటిలో ఏ ఒక్కదానికీ అతిగా ప్రాధాన్యం ఇచ్చినా జీవితంలో అసమతుల్యత తప్పదు.

ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఒకే వయసున్న ఇద్దరు స్నేహితులు ఒకే సంస్థలో ఉద్యోగం చేస్తున్నారనుకుందాం. ఇద్దరికీ దాదాపు ఒకే స్థాయిలో జీతం వస్తోంది. మొదటి వ్యక్తి సంపాదించిన డబ్బులో ఎక్కువ భాగాన్ని తన ఇష్టానుసారం ఖర్చు చేస్తాడు. కొత్త వస్తువులు కొనడం, ఖరీదైన హోటళ్లకు వెళ్లడం, ఇతరుల ముందు తన జీవనశైలిని గొప్పగా చూపించుకోవడం అతడికి అలవాటు. నెలాఖరులో చేతిలో డబ్బు మిగలదు. రెండో వ్యక్తి మాత్రం తన ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేస్తాడు. మరికొంత మొత్తాన్ని తన భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడిగా పెడతాడు. మిగిలిన డబ్బుతో కుటుంబంతో విహారయాత్రలు చేస్తాడు, స్నేహితులతో సరదాగా గడుపుతాడు, తనకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తాడు. కొన్నేళ్ల తర్వాత ఇద్దరి జీవితాల్లో తేడా స్పష్టంగా కనిపిస్తుంది. మొదటి వ్యక్తి సంపాదన పెరిగినా ఆర్థిక ఒత్తిడితోనే జీవిస్తుంటాడు. రెండో వ్యక్తికి మాత్రం అవసరమైనప్పుడు ఉపయోగపడే పొదుపు, క్రమంగా పెరిగిన పెట్టుబడులు, మనసుకు ఆనందాన్నిచ్చే జ్ఞాపకాలు ఉంటాయి. ఈ ఇద్దరి మధ్య తేడా సంపాదనలో కాదు.. డబ్బును నిర్వహించిన విధానంలో ఉంది.

అందుకే మన ఆదాయంలో ముందుగా కొంత మొత్తాన్ని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. అనుకోని ఖర్చులు ఎదురైనప్పుడు అప్పులపై ఆధారపడకుండా ఉండేందుకు అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అదే సమయంలో భవిష్యత్తులో పిల్లల చదువులు, సొంత ఇల్లు, పదవీ విరమణ వంటి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని మన సామర్థ్యానికి, రిస్క్‌ను భరించే స్థాయికి తగిన పెట్టుబడులను ఎంచుకోవాలి. పెట్టుబడి అంటే ఎక్కడో విన్న పథకంలో గుడ్డిగా డబ్బు పెట్టడం కాదు. దాని స్వభావం, లాభనష్టాలు, కాలపరిమితి తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలి. ఇక ఖర్చు విషయానికొస్తే.. ప్రతి ఖర్చునూ వృథాగా భావించకూడదు. కుటుంబంతో గడిపే సమయం, పిల్లలతో చేసే ప్రయాణం, ఇష్టమైన పుస్తకం కొనడం, స్నేహితులతో పంచుకునే చిన్న ఆనందాలు కూడా జీవితంలో విలువైనవే. అయితే ఆనందం కోసం అప్పులు చేయడం, ఇతరులను చూసి అవసరం లేని ఖర్చులు పెట్టడం మాత్రం సరైన అలవాటు కాదు. మన ఆదాయానికి మించి జీవించకుండా, మనసుకు నచ్చిన వాటి కోసం బాధ్యతాయుతంగా ఖర్చు చేయాలి. చివరికి డబ్బు మన జీవితాన్ని నడిపించకూడదు.. మన జీవితాన్ని మెరుగుపరచడానికి అది ఉపయోగపడాలి. ఎంత దాచాలి, ఎక్కడ పెట్టుబడి పెట్టాలి, ఎలా ఖర్చు చేయాలి అనే విషయాల్లో స్పష్టత ఏర్పడినప్పుడు ఆర్థిక భద్రతతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. డబ్బును కూడబెట్టడమే కాదు.. దానికి సరైన దిశ చూపించడం నేర్చుకున్నప్పుడే జీవితం నిజమైన సంపదతో నిండుతుంది.

ప్రజా భాగస్వామ్యమే కీలకం!


ఒక దేశ అభివృద్ధిని రహదారులు, రైల్వేలు, పరిశ్రమలు, పెట్టుబడులు, జీడీపీ వృద్ధి వంటి గణాంకాలతో కొలవడం సహజం. అయితే అభివృద్ధి అసలైన అర్థం ప్రజల జీవన విధానంలో వచ్చే మార్పు, వారి ఆలోచనల్లో పెరిగే విశ్వాసం, భవిష్యత్తుపై ఏర్పడే ఆశాభావం. ప్రభుత్వాలు అమలుచేసే పథకాల ఫలితాలు ప్రజల జీవితాల్లో కనిపించినప్పుడే. గత దశాబ్దంలో దేశంలో డిజిటల్ సేవలు, బ్యాంకింగ్ సౌకర్యాలు, రహదారులు, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణతో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. జనధన్ ఖాతాలు, ఆధార్ అనుసంధానం, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి వ్యవస్థలు ప్రభుత్వ సాయాన్ని నేరుగా లబ్ధిదారులకు చేరేందుకు మార్గం సుగమం చేశాయి. జీఎస్టీ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే పన్ను వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నం జరిగింది. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిల సమస్యను తగ్గించడం, వ్యాపార వ్యవస్థలో బాధ్యతాయుతమైన రుణ సంస్కృతిని ప్రోత్సహించడం వంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చాయి. భారత్ వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతున్న నేపథ్యంలో, 2047 నాటికి వికసిత భారత్‌గా అవతరించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తెస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు యువత, మహిళలు, రైతులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, స్థానిక సంస్థలు సహా సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరం. అభివృద్ధి అనేది ప్రభుత్వం రూపొందించే పథకాల జాబితాగా కాకుండా ప్రజలు తమ జీవితాల్లో సాధించాలనుకునే మార్పుగా మారాలి. అయితే ప్రజల్లో ఆకాంక్షలు పెరగడం మాత్రమే సరిపోదు. ఆ ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, ఆదాయం, ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులోకి రావాలి. దేశ ఆర్థిక వృద్ధి గణాంకాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, ప్రపంచ యుద్ధ పరిణామాలు, వాతావరణ మార్పులు వంటి అంశాలు సామాన్యుల జీవన వ్యయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల వికసిత భారత్ లక్ష్యం ప్రజల జీవితాల్లో వాస్తవంగా కనిపించే మార్పులతో ముడిపడినప్పుడే విస్తృతమైన ప్రజా ఉద్యమంగా మారుతుంది. ప్రభుత్వ పిలుపునకు ప్రజా స్పందన రావాలంటే, ప్రభుత్వం ప్రజల అవసరాలకు స్పందిస్తూ నమ్మకాన్ని పెంచుకోవాలి.

ప్రజల ఆలోచనల్లో, అలవాట్లలో మార్పు తీసుకురావడానికి స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఒక ముఖ్యమైన ఉదాహరణ. బహిరంగ మలవిసర్జన సమస్య దేశంలో చాలాకాలంగా కొనసాగుతున్న సామాజిక, ఆరోగ్య సమస్య. మరుగుదొడ్ల నిర్మాణానికి గతంలోనూ పథకాలు ఉన్నప్పటికీ, వాటి వినియోగం, నిర్వహణ, సామాజిక అవగాహనలో అనేక లోపాలుండేవి. 2014లో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభమైనప్పుడు గ్రామీణ పారిశుధ్య కవరేజీ సుమారు 39 శాతంగా ఉండగా, 2019 నాటికి దేశంలోని గ్రామాలన్నీ బహిరంగ మలవిసర్జనరహితంగా ప్రకటించబడ్డాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇప్పటివరకు 12 కోట్లకు పైగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించగా, 2026 సెప్టెంబరు నాటికి 5.69 లక్షల గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ హోదా సాధించాయి. వీటిలో 5.25 లక్షల గ్రామాలు మోడల్‌స్థాయికి చేరుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. రెండో దశలో మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామాల పరిశుభ్రత, ప్రజల్లో అవగాహన పెంపునకు ప్రాధాన్యమిస్తున్నారు. వ్యర్థాల నుంచి బయోగ్యాస్, సేంద్రీయ ఎరువుల తయారీ వంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడే అవకాశాలను కల్పిస్తున్నాయి. మహిళలకు ఇంటి వద్దే మరుగుదొడ్డి సౌకర్యం కల్పించడం వారి గౌరవం, భద్రత, ఆరోగ్యానికి ఎంతో కీలకం. పాఠశాలల్లో మరుగుదొడ్ల సదుపాయాలు బాలికా విద్య కొనసాగడానికి దోహదపడతాయి. అయితే నిర్మించిన మరుగుదొడ్ల సంఖ్యే విజయానికి కొలమానం కాదు. అవి ఉపయోగంలో ఉన్నాయా? నీటి సౌకర్యముందా? శుభ్రంగా నిర్వహిస్తున్నారా? గ్రామాల్లో చెత్త, మురుగు సమస్య పరిష్కారమైందా? అనే అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అధికారిక ప్రకటనలు, క్షేత్రస్థాయి వాస్తవాల మధ్య తేడాలున్న సందర్భాలు గతంలో వెలుగుచూశాయి. లక్ష్యాలను చేరుకోవాలనే ఒత్తిడితో ప్రజలను బలవంతం చేయడం, వారి సమస్యలను పట్టించుకోకపోవడం వంటి చర్యలు కార్యక్రమాలపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. పారిశుధ్యం అనేది అధికారుల తనిఖీలకు భయపడి పాటించే అలవాటు కాకుండా, ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా స్వీకరించే జీవన విధానంగా మారాలి. అందుకే స్వచ్ఛ భారత్ రెండోదశలో నిర్మాణాల కంటే నిర్వహణ, అవగాహన, ప్రజల భాగస్వామ్యం కీలకం.

గ్రామీణ కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో అమలవుతున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన కూడా ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకొచ్చే కార్యక్రమం. ఇల్లు అనేది కేవలం నివాస స్థలం కాదు; కుటుంబ భద్రత, ఆత్మగౌరవం, పిల్లల భవిష్యత్తుకు పునాది. ఈ పథకంలో మహిళల పేరిట లేదా ఉమ్మడి యాజమాన్యంలో ఇళ్లను నమోదు చేయడం ద్వారా కుటుంబ ఆస్తిపై మహిళలకు హక్కు కల్పించే ప్రయత్నం జరుగుతోంది. ప్రభుత్వ సమాచారం ప్రకారం 2026 ఆగస్టు నాటికి గ్రామీణ ఆవాస్ పథకం కింద 3.91 కోట్ల ఇళ్లు మంజూరయ్యాయి; 3.12 కోట్ల ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. 2029 నాటికి మొత్తం 4.95 కోట్ల గ్రామీణ ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు ఆస్తి హక్కులు, కుటుంబ నిర్ణయాల్లో భాగస్వామ్యం, ఆర్థిక భద్రత పెరిగే అవకాశం ఉంది. ఇల్లు నిర్మాణంతోపాటు ఉపాధి, మరుగుదొడ్డి, తాగునీరు, విద్యుత్, వంటగ్యాస్ వంటి ఇతర పథకాల అనుసంధానం జరిగితే జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఆదాయ అవకాశాలు కల్పించడం, లఖ్‌పతి దీదీ కార్యక్రమం వంటి ప్రయత్నాలు గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయి.

స్వచ్ఛ భారత్, ఆవాస్ యోజన వంటి పథకాలు ప్రభుత్వ సంకల్పం, ప్రజల అవసరాలు కలిసినప్పుడు సామాజిక మార్పు సాధ్యమని చూపిస్తున్నాయి. కానీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారానికి పరిమితం చేయకుండా, లోపాలను గుర్తించి సరిదిద్దుతూ, ప్రజాభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వాలి. ప్రజల భాగస్వామ్యమంటే ప్రభుత్వ పిలుపునకు స్పందించడం మాత్రమే కాదు; ప్రభుత్వ పనితీరును ప్రశ్నించడం, సమస్యలను తెలియజేయడం, పరిష్కారాల్లో భాగస్వాములు కావడం కూడా. పారదర్శకత, జవాబుదారీతనం, స్థానిక అవసరాలకు అనుగుణమైన అమలు, స్వతంత్ర పరిశీలన ఉంటే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. వికసిత భారత్ వంటి పెద్ద లక్ష్యం నిజమైన ప్రజా ఉద్యమంగా మారాలంటే ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలితాలు చేరాలి. నినాదాల కంటే ఇంటింటా కనిపించే మార్పు, గణాంకాల కంటే ప్రజల అనుభవం, హామీల కంటే అమలైన ఫలితాలే అభివృద్ధికి కొలమానాలు! ■





జీవితంలో ఆనందం పొందడానికి గొప్ప సందర్భాల కోసం ఎదురుచూడకండి. మనసుకు నచ్చిన పాట వింటూ, వేడివేడి కాఫీ ఆస్వాదిస్తూ, ఇష్టమైన వారితో కాసేపు మాట్లాడుకుంటూ, ఆత్మీయులతో నవ్వుతూ గడిపే చిన్న చిన్న క్షణాల్లోనూ సంతోషాన్ని వెతుక్కోండి. ఎందుకంటే ఆనందం అనేది మనం సాధించాల్సిన పెద్ద గమ్యం కాదు.. మన చుట్టూ ఉన్న అందమైన అనుభూతులను ఆస్వాదించే మనస్తత్వం. చిన్న చిన్న సంతోషాలను ప్రేమించడం నేర్చుకుంటే, సాధారణమైన జీవితమే అద్భుతమైన అనుభూతిగా మారుతుంది.

-మహాదేవ

వింతల్లో వింతలు

రాకీల రికార్డు!



ఫిలడెల్ఫియా మ్యూజియం ఆఫ్ ఆర్ట్ మెట్ల వద్ద నవంబర్ 13న "రాకీ"లు వందల సంఖ్యలో తరలివచ్చారు! స్టాలోన్ క్లాసిక్ చిత్రం విడుదలై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, నల్ల టోపీ, గ్రే స్వెట్‌ప్యాంట్, స్వెట్‌షర్ట్, నల్ల హై-టాప్ షూస్ ధరించి అభిమానులు రాకీ బాల్బోవాలా మారిపోయారు. చలి, చినుకులను లెక్కచేయకుండా వచ్చిన 570 మందితో గిన్నిస్ అధికారికంగా రికార్డును ధ్రువీకరించింది. రికార్డు ఖరారైన వెంటనే అందరూ మెట్లు పరుగెత్తి ఫొటోకు పోజిచ్చారు.

కేకేఆర్ వాటా విక్రయానికి రంగం సిద్ధం



- 400 మిలియన్ డాలర్లకు భారీ డీల్!
- 22.5 శాతం వాటాను విక్రయించేందుకు జయ్ మెహతా సన్నాహాలు
- అమెరికా పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో చర్చలు

ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) సహ-యజమాని జయ్ మెహతా తన 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో సుమారు 400 మిలియన్ డాలర్లకు (రూ. 3,300 కోట్లకు పైగా) ఈ భారీ నగదు ఒప్పందం జరగనుంది.

ముంబై/కోల్‌కతా, నవంబర్ 18 (నేటి సాక్షి): ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యంలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. జట్టు సహ-యజమాని జయ్ మెహతా కేకేఆర్‌లో తనకున్న 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ 'ఎరెస్ మేనేజ్‌మెంట్'కు ఈ వాటాను విక్రయించనున్నారు. ఈ ఒప్పందం విలువ సుమారు 400 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 3,300 కోట్లకు పైగా) ఉంటుందని సమాచారం. ఈ డీల్ ప్రకారం కేకేఆర్ జట్టు మొత్తం విలువను 1.78 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 16,634 కోట్లు) నిర్ణయించారు. ఇటీవల రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల విక్రయాల విలువలకు అనుగుణంగానే కేకేఆర్ విలువ కూడా నమోదవడం విశేషం.

బీసీసీఐ అనుమతి తప్పనిసరి.. 5 శాతం రుసుము చెల్లింపు:

బాలీవుడ్ అగ్ర నటుడు షారుఖ్ ఖాన్‌కు కేకేఆర్‌లో 55 శాతం వాటా ఉండగా, జయ్ మెహతా, ఆయన భార్య, ప్రముఖ నటి జూహీ చావ్లాకు కలిపి 45 శాతం వాటా ఉంది. వీరంతా కలిసి 2007లో ఈ జట్టును కొనుగోలు చేశారు. తాజా వాటా విక్రయ ఒప్పందం పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. అయితే, ఈ వాటా బదిలీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారిక అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం, కొత్త పెట్టుబడిదారు నేపథ్యాన్ని బీసీసీఐ క్షుణ్ణంగా పరిశీలించనుంది. అంతేకాకుండా, ఈ ఒప్పందం మొత్తం విలువలో 5 శాతం అంటే సుమారు 20 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 200 కోట్లు) బీసీసీఐకి రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. 2022లో సీవీసీ క్యాపిటల్ సంస్థ గుజరాత్ టైటాన్స్ జట్టును కొనుగోలు చేసినప్పటి నుంచి ఐపీఎల్ ఫ్రాంచైజీలపై అమెరికా పెట్టుబడి సంస్థల ఆసక్తి బాగా పెరిగింది. ఆర్సీబీ జట్టులో కూడా బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్ వంటి అమెరికా సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. ప్రస్తుతం కేకేఆర్ వాటాను కొనుగోలు చేస్తున్న ఎరెస్ మేనేజ్‌మెంట్‌కు క్రీడా రంగంలో పెట్టుబడులు పెట్టడం కొత్తేమీ కాదు. ఈ సంస్థకు ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్‌లో ప్రఖ్యాత చెల్సీ ఎఫ్‌సీ, ఎన్‌ఎఫ్‌ఎల్‌లో మయామి డాల్ఫిన్స్ జట్లలో వాటాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇంగ్లాండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌లోని ట్రెంట్ రాకెట్స్ జట్టుకు కూడా సహ-యజమానిగా వ్యవహరిస్తోంది. మూడుసార్లు ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన కేకేఆర్ జట్టులో జరుగుతున్న ఈ వాటా మార్పు క్రీడా, వాణిజ్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



బాల్ ట్యాంపరింగ్ అందరికీ తెలుసు..

ఆసీస్ బండారం బయటపెట్టిన బ్యాన్‌క్రాఫ్ట్!

కేప్‌టౌన్, నవంబర్ 18 (నేటి సాక్షి): ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసిన 2018 కేప్‌టౌన్ బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో సాండ్‌పేపర్‌తో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించి పట్టుబడిన ఆస్ట్రేలియా క్రికెటర్ కెమెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ ఎనిమిదేళ్ల తర్వాత సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారం తనకు, డేవిడ్ వార్నర్‌కు మాత్రమే పరిమితం కాదని, జట్టు కోచ్‌లు, ప్రధాన బౌలర్లకు కూడా ముందే తెలుసని పేర్కొన్నారు. మ్యాచ్‌లో ఆధిపత్యం సాధించాలనే ఒత్తిడిలో భాగంగా వార్నర్ ఈ ఆలోచన చేశారని, జట్టులో కొత్తవాడినైన తనతో ఆ పని చేయించారని వెల్లడించారు. జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవాలనే ఉద్దేశంతో తప్పని తెలిసినా అంగీకరించానని బ్యాన్‌క్రాఫ్ట్ వివరించారు. ప్రధాన కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్‌తోపాటు పలువురు బౌలర్లకు ఈ వ్యవహారంపై అవగాహన ఉందని ఆరోపించారు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, టిమ్ పెయిన్ పేర్లను కూడా ప్రస్తావించారు. బంతి రివర్స్ స్వింగ్ అవుతున్న తీరుపై వారు తనతో మాట్లాడేవారని పేర్కొన్నారు. తన కదలికలు కెమెరాలకు చిక్కే ప్రమాదం ఉందని కోచ్ లీమన్ హెచ్చరించారని తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన తెలియాల్సి ఉంది. మైదానంలో సాండ్‌పేపర్ ఉపయోగిస్తూ కెమెరాలకు చిక్కిన తర్వాత అసలు విషయాన్ని బయటపెట్టవద్దని జట్టు మేనేజ్‌మెంట్ ఒత్తిడి తెచ్చిందని బ్యాన్‌క్రాఫ్ట్ ఆరోపించారు. సాండ్‌పేపర్ బదులుగా టేప్, మట్టి ఉపయోగించినట్లు చెప్పాల్సి వచ్చిందన్నారు. 2021లో బౌలర్లకు ఈ వ్యవహారం తెలుసా అనే ప్రశ్నకు తాను ఇచ్చిన సమాధానం తర్వాత వారు తమకేమీ తెలియదని ప్రకటనలు చేయడం బాధించిందని పేర్కొన్నారు. శిక్ష పూర్తయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో రాణించినప్పటికీ తిరిగి జాతీయ జట్టులో అవకాశం దక్కలేదని బ్యాన్‌క్రాఫ్ట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంలో తప్పుల భారాన్ని తానొక్కడినే మోస్తున్నానని, ఉస్మాన్ ఖ్వాజా పుస్తకం విడుదలైన నేపథ్యంలో అసలు విషయాలను అభిమానులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మాట్లాడుతున్నానని చెప్పారు. బ్యాన్‌క్రాఫ్ట్ తాజా ఆరోపణలతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో బాల్ ట్యాంపరింగ్ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది.

సోనాల్‌బెన్‌కు కాంస్యం

పటాయా: ఐటీటీఎఫ్ ప్రపంచ పారా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి సోనాల్‌బెన్ పటేల్ కాంస్యంతో చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీలో పతకం గెలిచిన భారత తొలి ప్లేయర్‌గా ఘనత సాధించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్లాస్-3 సెమీఫైనల్లో ఆమె 9-11, 11-6, 7-11, 5-11తో కార్లోటా రగాజిని (ఇటలీ) చేతిలో ఓడి, కాంస్యంతో సరిపెట్టుకుంది. 2020 పారాలింపిక్స్ పతక విజేత భావినా దేవి క్వార్టర్‌ఫైనల్లోనే నిష్క్రమించింది.



ఏడాదిలో నాలుగు... శర్వా రికార్డ్ అయ్యేనా?



2026లో ఇప్పటికే 'నారి నారి నడుమ మురారి', 'బైకర్' సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శర్వానంద్.. డిసెంబర్‌లో 'భోగి'తో రావాలని చూస్తున్నారు. ఇక 2027 జనవరి 14న 'జార్జ్ క్రిష్' విడుదల కానుంది. ఈ రెండు సినిమాలు అనుకున్న సమయానికి వస్తే ఏడాది వ్యవధిలో శర్వానంద్ నుంచి నాలుగు సినిమాలు విడుదలైనట్లవుతుంది.ఒకప్పుడు హీరోలు ఏడాదిలో పది సినిమాలు అంతకు మించి సినిమాలు చేశారు. కానీ ఇప్పుడు హీరోలు ఏడాదికి కనీసం ఒక్క సినిమాను సైతం విడుదల చేయలేక పోతున్నారు. స్టార్ హీరోలు రెండు ఏళ్లకు ఒక సినిమా అన్నట్లుగా విడుదల చేస్తున్నారు. ఏడాదికి రెండు సినిమాలు చేయాలని ప్రతి హీరో అనుకుంటున్నాడు, కానీ పరిస్థితులు అనుకూలించడం లేదు. ప్రభాస్ ఆ మధ్య వలు సార్లు ఏడాదిలో రెండు సినిమాలతో రావాలని ఎక్కువ సినిమాలు ఒప్పుకుంటున్నాను. కానీ మేకింగ్ విషయంలో ఆలస్యం కావడం వల్ల ఏడాదికి ఒకటి కూడా విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ ఏడాది తమిళ్ హీరో సూర్య ఏకంగా మూడు సినిమాలు విడుదల చేసి, ఆ మూడు సినిమాలతో సూపర్ హిట్ దక్కించుకుని, ఒక్క క్యాలెండర్ ఇయర్ లో ఏకంగా రూ.1000 కోట్లకు మించి వసూళ్లు రాబట్టిన హీరోగా రికార్డ్ నెలకొల్పాడు. హిట్ రికార్డ్ ఏమో కానీ శర్వా ముందు కూడా ఒక అరుదైన రికార్డ్ ఉంది.

శర్వానంద్ హీరోగా భోగి...

ఒక ఏడాది కాలంలో ఏకంగా నాలుగు సినిమాలను విడుదల చేసిన ఘనత శర్వానంద్ దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2026లో ఇప్పటికే నారి నారి నడుమ మురారి సినిమాతో పాటు బైకర్ సినిమాతో వచ్చాడు. ఈ రెండు సినిమాలు కాకుండా ఇదే ఏడాదిలో 'భోగి' సినిమాతో శర్వానంద్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీపావళి కానుకగా సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. వాయిదా పడ్డ సినిమాను మరీ ఆలస్యం చేయకుండా డిసెంబర్ లో కచ్చితంగా విడుదల చేస్తామని మేకర్స్ చెబుతున్నారు. క్రిస్మస్ కంటే ముందుగానే భోగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. శర్వానంద్ భోగి సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. సినిమా నుంచి వచ్చిన పాటలు, పోస్టర్స్ అంచనాలు పెంచాయి. కనుక మళ్లీ భోగి ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

జార్జ్ క్రిష్ సినిమాలో శర్వానంద్..

డిసెంబర్ లో భోగి సినిమా వస్తే నెల రోజుల గ్యాప్ లోనే సంక్రాంతి కానుకగా 'జార్జ్ క్రిష్' విడుదల కాబోతుంది. నారి నారి నడుమ మురారి సినిమా 2026 జనవరి 14న విడుదల కాగా, సరిగ్గా ఏడాదికి అంటే 2027 జనవరి 14న జార్జ్ క్రిష్ విడుదల కాబోతుంది. అంటే ఏడాది కాలంలో శర్వానంద్ నుంచి ఏకంగా నాలుగు సినిమాలు విడుదల అయినట్లు అవుతుంది. ప్రస్తుతం ఉన్న యంగ్ హీరోల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తున్నారు. అలాంటిది శర్వానంద్ ఏకంగా ఏడాది కాలంలో నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడం అనేది కచ్చితంగా రికార్డ్ అనడంలో సందేహం లేదు. రెండు సినిమాల ఫలితాలు నిరుత్సాహ పరిచాయి, అయితే రాబోయే రెండు సినిమాలు హిట్ అయితే కచ్చితంగా ఆయన సాధించిన ఈ రికార్డ్ మరింత స్పెషల్‌గా మారే అవకాశం ఉందని ఆయన అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సంక్రాంతి కానుకగా శర్వానంద్ మూవీ...

జార్జ్ క్రిష్ సినిమాను శ్రీను వైట్ల తనదైన మార్క్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నట్లు మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు డబ్బింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. పూజా కార్యక్రమాలు నిర్వహించి డబ్బింగ్ మొదలు పెట్టారు. సినిమాను సంక్రాంతికి విడుదల చేయాల్సి ఉండగా ఈ నెల చివరి వరకు లేదా డిసెంబర్ లో పట్ట కాపీ రెడీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. డిసెంబర్ చివరి వరకు సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి విడుదలకు రెడీ చేయడం జరుగుతుందని యూనిట్ సభ్యులు అంటున్నారు. ఈమధ్య కాలంలో విడుదలకు ముందు ఇంత త్వరగా ఫస్ట్ కాపీ రెడీ కావడం అరుదుగా చూస్తూ ఉంటాం. శ్రీను వైట్ల గత చిత్రాల ఫలితాన్ని పక్కన పెట్టి శర్వానంద్ నమ్మకంతో ఈ సినిమాను చేశాడు. మరి భోగి, జార్జ్ క్రిష్ సినిమాలతో శర్వానంద్ హిట్ కొట్టి ఈ ఏడాదిలో స్పెషల్ స్టార్‌గా నిలుస్తాడా అనేది చూడాలి.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com